ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇజ్రాయెల్ ఉన్మాదం

యుద్ధానికి కూడా హద్దులుంటాయి, నీతినియమాలుంటాయి. హమాస్‌తో పోరులో ఇజ్రాయెల్ నానావిధ అతిక్రమణలకూ పాల్పడుతోంది, అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోంది. గాజాలో ఆపన్నులకు కాస్తంత సాయాన్ని అందిస్తున్న ఏడుగురు వర్కర్లను ఇజ్రాయెల్ దళాలు కాల్చివేయడం, మిగిలివున్న ఆ ఒక్క ప్రధాన ఆస్పత్రిని కుప్పకూల్చడం, పొరుగుదేశంలోని మరోదేశం కాన్సులేట్ మీద దాడిచేసి కీలకమైన వ్యక్తులను చంపివేయడం వంటి చర్యలు ఇజ్రాయెల్ మిగతాప్రపంచానికి ఎంతమాత్రం జడవడం లేదనడానికి నిదర్శనం. ఈ వరుస సంఘటనలపట్ల ఇజ్రాయెల్ ప్రతిస్పందన చూసినప్పుడు అది శత్రువులకూ, మిత్రులకూ కూడా జవాబుదారీగా ఉండదల్చుకోలేదని అర్థమవుతుంది.

స్వచ్ఛంద సంస్థ 'వరల్డ్ సెంట్రల్ కిచెన్'కు చెందిన ఏడుగురు సహాయకులను సోమవారం ఇజ్రాయెల్ చంపివేయడం పొరపాటున జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. యుద్ధం అన్నాక ఇటువంటివి సహజం అని ఇజ్రాయెల్ అధినేత బెంజమీన్ నెతన్యాహూ ఎంతో తేలికగా ఈ ఘటనను తీసిపారేశారు. కానీ, ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) తమ వాహనం మీద దాడిచేశాయని ఈ చారిటీ సంస్థ అధినేత ఆరోపిస్తున్నారు. ఆ వాహనం ఒక సహాయక సంస్థదని తెలియచెప్పే గుర్తులు దాని మీద స్పష్టంగా ఉన్నాయి. పైగా ఐడీఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ ఘర్షణలేని ప్రాంతం గుండా అది ప్రయాణిస్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. మూడుసార్లు కాల్పులు జరపడం, కొందరు చనిపోగా, పారిపోతున్న మిగతా సహాయకసిబ్బందిని కూడా వదిలిపెట్టకుండా హతమార్చడం వంటివి గమనించినప్పుడు ఇజ్రాయెల్ దళాలు పొరపాటుపడ్డాయని అనుకోలేం. మరణించినవారిలో బ్రిటన్, అమెరికా పౌరులు ఉన్నందువల్ల కాబోలు, నెతన్యాహూ ఈ ఘటనను అంగీకరించారు కానీ, అది ఉద్దేశపూర్వకమైనది కాదన్నారు.

ఇంతటి ఘోరమైన సంఘటమీద కూడా అమెరికా, బ్రిటన్‌లు తీవ్రంగా స్పందించలేకపోయాయి. జరిగిన దానిమీద లోతైన దర్యాప్తు చేయించమని బ్రిటన్ తిరిగి ఇజ్రాయెల్‌నే అడిగిందంటే అగ్రదేశాలు ఎంతగా సాగిలబడ్డాయో అర్థమవుతుంది. పచ్చి అబద్ధాలు, మోసాలతో యుద్ధాన్ని సాగిస్తున్న ఇజ్రాయెల్ నుంచి నిజాలు బయటకురావని వాటికి మాత్రం తెలియదా? పారదర్శకతకు పాతరేసి, నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ముప్పైమూడువేల మంది పాలస్తీనియన్లను ఊచకోతకోసి, గాజాను నేలమట్టంచేసి, లక్షమందిని నిరాశ్రయులుగా మార్చిన ఇజ్రాయెల్ ఇకమీదట తన తప్పులు బయటకు పొక్కకుండా, క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలియనివ్వకుండా మరిన్ని అదనపు జాగ్రత్తలు తీసుకుంటోంది. గాజాలో ఘోరాలను బయటి ప్రపంచానికి తెలియచెబుతున్న అల్ జజీరా చానెల్‌మీద అది ప్రత్యేకంగా కక్షకట్టింది. నచ్చని విదేశీ చానెళ్ళను గెంటివేసే అధికారాలను నెతన్యాహూ తన మంత్రులకు కట్టబెట్టారు. విదేశీ సహాయకులమీద ఉద్దేశపూర్వకంగా జరిపిన ఈ దాడిద్వారా పాలస్తీనియన్లకు అందుతున్న ఆ కాసింత సాయాన్ని కూడా అడ్డుకోవాలని ఇజ్రాయెల్ ఉద్దేశం. హమాస్ అభిమానులతోనూ, ఉగ్రవాదులతోనూ ఐక్యరాజ్యసమితి సహాయక సంస్థ 'యుఎన్ఆర్‌డబ్ల్యుఏ' నిండిపోయిందని ఆరోపిస్తూ, దానికి సరఫరాలు జరగకుండా అడ్డుపడుతూ పాలస్తీనాలో దాని ఉనికే లేకుండా చేయాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. తద్వారా మరిన్ని వేలమంది తమకు తాముగా చనిపోయేట్టు చేస్తున్నది.

ఇక, ఏప్రిల్ ఒకటిన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడిచేసి, రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నతస్థాయి కమాండర్లను ఇజ్రాయెల్ చంపివేయడం ప్రమాదకరమైన చర్య. ప్రతీకారం తీర్చుకొని తీరుతానని ఇరాన్ వెంటనే హెచ్చరించింది. ఆ దేశం కానీ, దాని అండదండలతో దాడులు చేస్తున్న హౌతీ, హిజ్‌బుల్లా ఇత్యాది సంస్థలు కానీ తనను ఏమీ చేయలేవని ఇజ్రాయెల్‌కు గట్టినమ్మకం ఉన్నట్టుంది. కానీ, ఇరాన్ అధినేత హెచ్చరికల నేపథ్యంలో ప్రతీకారం ఏదో ఒక స్థాయిలో ఉంటుందన్నది వాస్తవం. ప్రతిదాడులు జరిపే హక్కు తనకు ఉందని భద్రతామండలి సమావేశంలో ఇరాన్ విస్పష్టంగా ప్రకటించింది. హమాస్‌ను సమూలంగా నిర్మూలించేవరకూ యుద్ధం కొనసాగుతుందని చెబుతూ చిత్తంవచ్చినట్టు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్‌ను వెంటనే దారికితెచ్చి కాల్పుల విరమణకు ఒప్పించకపోతే, యుద్ధం విస్తరించి, చర్చలకు కూడా వీల్లేని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది.

వికృతచర్యతో విద్యావ్యవస్థకు పాతర

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను ప్రభుత్వమే నిర్వీర్యం చేస్తోంది. విద్యారంగం అభివృద్ధి చెందితేనే సామాజిక చైతన్యం వికసిస్తుంది, విలువలు పరిరక్షించబడతాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయి చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలల విలీనం, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల రద్దు, మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తం, బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో అలసత్వం, మౌలికసౌకర్యాల గురించి పట్టించుకోకపోవడం వంటివి విద్యారంగానికి శాపంగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదపిల్లలు ఉన్నత చదువులకు వెళ్లేలా చేశాం, ప్రభుత్వబడుల్లో ఆణిముత్యాల్ని తీర్చిదిద్దే విద్యావిధానాన్ని తీసుకొచ్చాం అని చాటుకుంటూనే ఈ ప్రభుత్వం బడులకు తాళాలు వేసి పేదపిల్లల చదువులను చట్టుబండలు చేసింది.

గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం విద్యార్థులకు అందించే ట్యాబుల్లో పాలకులు 25,379 ట్యాబులను కోతపెట్టారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో ట్యాబ్ ధర రూ.11,200లు మాత్రమే ఉంటే, రూ.15,500లకు కొన్నట్టు లెక్కలు చూపించి గడచిన రెండేళ్లలో రూ.470 కోట్లు కమీషన్లు కొట్టేశారు. నాడు–నేడు పేరుతో, ప్రభుత్వ పాఠశాలలకు రంగులేసే నెపంతో, ఇతర పనులు చేసినట్టు చెప్పి రూ.3వేల కోట్లు దోచుకున్నారు. పాఠశాల ప్రాంగణాల్లో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి హైకోర్టుతో మొట్టికాయలు వేయించుకున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు ఏర్పాటుచేసి 2,45,000 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే, జగన్ సర్కార్ ఏకంగా ఆ పథకాన్నే రద్దు చేయడం తెలివిమాలిన చర్య.



టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాల కొరత, బట్టల కొరత, తాగునీటి కొరతలతో విద్యావ్యవస్థను అధఃపాతాళానికి నెట్టేసింది రాష్ట్ర ప్రభుత్వం. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,73,416 మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేశారు. పెత్తందారీ విధానం రూపుమాపడం అంటే పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయడమా? పేదవిద్యార్థులను ప్రాథమిక విద్యకు దూరం చేయడమే వారిని అభ్యున్నతివైపు నడిపించడమా?

దీనికి తోడు టీచర్ల కొరత, పాఠ్యపుస్తకాల కొరత, బట్టల కొరత, తాగునీటి కొరత.. ఇలా అన్నిరకాల కొరతలతో విద్యావ్యవస్థను అధఃపాతాళానికి నెట్టేసింది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,73,416 మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేశారు. పెత్తందారీ విధానం రూపుమాపడం అంటే పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయడమా? ప్రైవేటుబడులతో పోటీపడటం అంటే ప్రాథమిక పాఠశాలలకు తాళాలు వేయడమా? పేదవిద్యార్థులను ప్రాథమిక విద్యకు దూరం చేయడమే వారిని అభ్యున్నతి వైపు నడిపించడమా? దాదాపు 9 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క టీచర్ మాత్రమే ఉన్నారు.

ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమహాస్టళ్ళు మనరాష్ట్రంలో ఉన్నా వాటిలోని వసతులు పరమ అధ్వానంగా ఉండడంతో విద్యార్థుల శాతం తగ్గిపోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఛార్జీలు సరిపోక హాస్టల్ విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తుంటే ఎన్నికలు వస్తున్నాయని ఆగమేఘాల మీద ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియను ప్రకటించి కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అయిదేళ్లుగా ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు.

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం విద్యారంగంలో 3వ స్థానంలో ఉన్న రాష్ట్రం 19వ స్థానానికి దిగజారిపోయింది. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా పదోతరగతి ఫలితాల్లో కేవలం 64.02 శాతం ఉత్తీర్ణత సాధించడం సిగ్గుచేటైన విషయం. చంద్రబాబు తన హయాంలో ప్రతి గ్రామంలో కనీసం ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక మాధ్యమిక పాఠశాల, ప్రతి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఒక ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయగా ప్రస్తుత సర్కార్ నూతన విద్యా విధానం పేరిట 11వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, 3, 4, 5 తరగతుల విలీనంతో ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉండే బడుల సంఖ్య భారీగా పెరిగిందని స్వయంగా కేంద్ర విద్యాశాఖ పార్లమెంట్‌లోనే సమాధానమిచ్చింది. ఆంగ్లంతో పోలిస్తే మాతృభాష తెలుగును చదవడంలో ఏపీ విద్యార్థులు వెనుకబడిపోయారని ప్రముఖ అధ్యయన సంస్థ యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) విడుదల చేసిన వార్షిక విద్యాస్థితి నివేదిక–2022లో ఈ విషయాన్ని వెల్లడించింది.

డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులు పూర్తిచేసిన దాదాపు 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో ఉన్నతవిద్య చదివే అవకాశం కోల్పోయి, ఉద్యోగావకాశాలు కోల్పోయి వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరమైపోయింది. ప్రైవేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీ విద్యార్థులకు 2020–21 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన నిలిపివేస్తూ జీవోను విడుదల చేశారు. 1.7 లక్షల మంది పీజీ విద్యార్థుల్లో 80 శాతం మందికి ఈ రెండు దీవెనలు రద్దుచేయడం ద్వారా రూ.600 కోట్లు ఆదా చేసుకున్నారు. ఆ చర్యతో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదవిద్యార్థుల ఉన్నత చదువుల కలను చెరిపివేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి వికృతచర్యలతో విద్యారంగం ఉనికినే కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఏ దేశ విద్యారంగం ప్రగతిపథంలో పయనిస్తుందో ఆ దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందనడంలో సందేహం లేదు. అలాంటి విద్యారంగాన్ని విధ్వంసం చేస్తున్న పాలనకు ప్రజలు ఇప్పటికైనా ముగింపు పలకాలి. టీడీపీ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు అండగా నిలబడడంతో పాటు విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తుంది.

■ కంచర్ల శ్రీకాంత్
శాసనమండలి సభ్యులు

మోదీకి ఎమర్జెన్సీ అవసరమే లేదు!



ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది?



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ప్రతిపక్షాలు జరిపిన 'సేవ్ డెమాక్రసీ' ర్యాలీలో 2024 ఎన్నికలకు ఒక ఎజెండాను నిర్దేశించే లక్ష్యంతో 'బీజేపీ వెర్సస్ డెమాక్రసీ' అనే పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలందరూ ఇలా ఏకమయ్యారు. 'నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించటం' అన్నమాట ఇక్కడ పలుమార్లు వినిపించింది. అచ్చంగా ఇదే నినాదంమీద చారిత్రాత్మక 1977 ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. ఇందిరాగాంధీ అంతటి బలమైన శక్తిని ఓడించాయి. కానీ కాస్త లోతుగా పరిశీలిస్తే, 2024కీ 1977కీ చాలా తేడా ఉంది, నరేంద్ర మోదీకీ ఇందిరాగాంధీకీ పోలిక లేదు.

మొదటి విషయమేమిటంటే– ఇరవై ఒక్క నెలల పాటు సాగిన ఎమర్జెన్సీ కాలంలో వందలాది మంది రాజకీయ నేతల, ఉద్యమకారుల అరెస్టుతో, ఇప్పుడు ఇద్దరు ప్రతిపక్ష ముఖ్యమంత్రుల అరెస్టును పోల్చలేం. ప్రతిపక్షాలను అణచివేయటానికి ప్రభుత్వ సంస్థలను ఆయుధాలుగా వాడటమన్నది నాటి పదవీ దుర్వినియోగాన్ని గుర్తుకు తెచ్చినా, దీన్ని ఎమర్జెన్సీ కాలంతో పోల్చటమంటే మరీ దూరం వెళ్ళినట్టే. ప్రభుత్వానికి ఏ మాత్రం పోటీ ఇవ్వలేని బలహీనమైన ప్రతిపక్షమే ఉన్నప్పటికీ, మరీ 'ప్రతిపక్ష రహిత భారతం' అన్న మాట వాడే దశలో ఇంకా లేము. దీనికి మహారాష్ట్రలో ప్రతిపక్షం ఇస్తున్న బలమైన పోటీ ఒక ఉదాహరణ.

రెండో విషయం– అతుకులబొంత లాంటి నేటి ప్రతిపక్ష కూటమి 'ఇండియా'తో పోలిస్తే, 1977ల నాటి ప్రతిపక్షం ఎంతో రాజకీయ అనుభవాన్ని, ప్రతిష్ఠను కలిగి ఉండేది. నాడు సోషలిస్ట్, జన్‌సంఘ్ వంటి విభిన్న శక్తులు తీవ్రమైన కాంగ్రెస్ వ్యతిరేకత పునాదిగా ఏకమై రాత్రికి రాత్రి జనతా పార్టీకి పోత పోశాయి. స్వాతంత్ర్య సమరయోధుడైన జయప్రకాష్ నారాయణ్ ఆ కూటమికి ఒక నైతికమైన వెన్నెముకగా నిలిచారు. మొన్న రామ్‌లీలా మైదాన్‌లో గుమికూడిన వారిలో ఒక్కరైనా జయప్రకాష్ నారాయణ్ లాంటి నీతిబద్ధమైన నాయకత్వాన్ని గుర్తు తేగలరా? మోదీపై వ్యతిరేకత నేటి ప్రతిపక్షాల్ని పైస్థాయిల్లో ఏకం చేస్తున్నప్పటికీ, కింది స్థాయిల్లో వాటి మధ్య ఘర్షణ వాతావరణం ఇంకా సమసిపోలేదు. పంజాబ్‌లో ఆప్ – కాంగ్రెస్ వైరం, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌తో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల వైరం, మరో పక్క కేరళలో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల మధ్య వైరం కొనసాగుతూనే ఉంది.

మూడో విషయం– ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేయటం అనే అంశంలో ఈ ప్రతిపక్షాలేవీ తక్కువ తినలేదు. నియంతల్లా ప్రవర్తించిన ముఖ్యమంత్రులు ప్రతిపక్షంలో చాలామంది ఉన్నారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర (వికాస్ అగాడీ పాలన)ల్లో భిన్నాభిప్రాయం వెల్లడించిన గొంతులు కఠిన శిక్షలను ఎదుర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఒక ఆయుధంగా వాడుకున్నట్టే ఈ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పోలీస్ యంత్రాంగాన్ని వాడుకున్నాయి.

నాలుగో విషయం– ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాల్సిన ఆవశ్యకత కాలక్రమేణా ప్రజల దృష్టిలో ఏమంత ప్రాధాన్యత గల విషయం కాకుండా పోయింది. ఇందుకు భిన్నంగా 1977లో ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సన్నగిల్లడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం అమలు చేసిన బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు దీనికి కారణమయ్యాయి. ఎమర్జెన్సీ చర్యల ప్రభావం అంతగా పడని దక్షిణాది నుంచి మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు లభించింది. పైపెచ్చు ప్రజాస్వామిక విలువలు మనగలిగేందుకు బలమైన చోదక శక్తిగా నిలిచే పట్టణ మధ్యతరగతి వర్గం 1970ల నాటితో పోల్చి చూస్తే ఇప్పుడు ఎంతో భిన్నమైన సామాజిక – ఆర్థిక వర్గంగా మారింది. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో పట్టణాల్లో ప్రమాణాలూ, విలువలూ సన్నగిల్లుతాయి. 'నాకు నేను ముఖ్యం' తరహా జీవన శైలికి అలవాటుపడిన పౌరులు రాజకీయ ఉద్యమాలకు దూరం జరుగుతారు. స్వలాభానికి నష్టం వాటిల్లే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రమే వారు ఉద్యమాల వైపు అడుగులు వేస్తారు. పేపర్ లీకేజీలకు నిరసనగా రోడ్డెక్కిన యువతను, రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతాంగాన్నీ ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక మిగిలిన ప్రజా బాహుళ్యమంతా ఆన్‌లైన్ ఉద్యమాలకే పరిమితం అవుతుంది. దేశంలో నియంతృత్వం గురించి ధ్రువ్ రాఠీ అనే యూట్యూబర్ చేసిన వీడియోను ఆవేశంగా షేర్ చేయటంతోనే రాజ్యాంగ స్వేచ్ఛలను పరిరక్షించే పోరాటంలో వీరి పాత్ర ముగిసిపోతుంది. 1970ల్లోని పరిస్థితి వేరు. అప్పటికింకా ట్రేడ్ యూనియన్లు, పౌర హక్కుల సంఘాలు, ఆదర్శవాద రాజకీయాలు సజీవంగా ఉన్నాయి. ప్రజాస్వామిక ఆవరణ కోసం పోరాడటం అనేది అప్పటికి ఎంతో ముఖ్యమైన అంశం. ఇప్పుడు పరిస్థితి వేరు. ఇప్పుడు అంతా వాట్సాప్ మెసేజీలకే పరిమితం.

చిత్రమేమిటంటే, పట్టణ మధ్యతరగతి ఆగ్రహావేశాలతో ఉప్పొంగి, రాజకీయ వర్గాల్ని కుదిపివేసిన ఆఖరు ఘట్టంలో కేజ్రీవాల్ కూడా ఉన్నారు. 2011లో కేజ్రీవాల్, ఆయన బృందం కలిసి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని మొదలుపెట్టిన సందర్భమది. మొత్తం రాజకీయ వర్గమంతటికీ వ్యతిరేకంగా రాజకీయాల్ని శుద్ధి గావించే ఉద్యమంగా అది పేరుమోసింది. 'నేతలందరూ దొంగలే' (సబ్ నేతా చోర్ హై) అన్న నినాదంతో పాలక వర్గాల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నవారంతా రోడ్ల మీదకొచ్చి ప్రదర్శనలు చేశారు. అప్పటికి కేజ్రీవాల్ వ్యవస్థలను వ్యతిరేకిస్తున్న ఒక బైటి మనిషి. ఆయన ఏ శక్తులపై అప్పుడు దాడి చేశారో అదే శక్తులతో ఇప్పుడు జట్టు కట్టారు. నాడు 'అవినీతి వ్యతిరేక' ఉద్యమానికి నాయకత్వం వహించిన మనిషి కాలచక్రం గిర్రున తిరిగేసరికి నేడు ఢిల్లీ లిక్కర్ పాలసీ మచ్చను చెరిపివేసుకోవటానికి తాను అవినీతి ఆరోపణల్ని ఎక్కుపెట్టినవారితోనే కలిసి ప్రయత్నిస్తున్నాడు. ఇలా స్వీయరక్షణ కోసం ఏర్పాటైన రాజకీయ అమరికకు విశ్వసనీయత ఎలా వస్తుంది, అది ఎన్నాళ్ళని కొనసాగుతుంది?

మరో పరస్పర విరుద్ధమైన విషయం ఏమిటంటే– రాజకీయ నేతలపై తీవ్ర వ్యతిరేకత సృష్టించిన కేజ్రీవాల్ 'అవినీతి వ్యతిరేక ఉద్యమం' నుంచి అతిపెద్ద లబ్ధి పొందింది ఎవరంటే ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కుప్పకూలిన శిథిలాల మధ్య నుంచి మోదీ అధికారం వైపు అడుగులు వేశారు. ఆయన ఇందిరాగాంధీ దగ్గర నుంచి కొన్ని కిటుకులు అరువు తెచ్చుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగ వ్యవస్థలపై పూర్తి నియంత్రణ కోసం అన్ని రకాల వ్యవస్థాగతమైన అడ్డంకులను నిర్మూలించటంలో.

ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. కానీ మోదీ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి తలొగ్గి పని చేస్తున్నానని ప్రకటిస్తూనే దాన్ని ఎన్నికల నియంతృత్వంవైపు, మెజారిటేరియన్ మతస్వామ్యంవైపు ఒక క్రమ పద్ధతిలో ముందుకు నెడుతున్నారు.


ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది? ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌కు బెయిల్ ప్రొవిజన్ సవరణలను పార్లమెంటులో మనీ బిల్లుగా ప్రవేశపెడితే, దానికి అనూహ్యంగా సుప్రీంకోర్ట్ బెంచ్ నుంచి ఆమోదం లభించింది. పదవీ విరమణకు దగ్గర్లో ఉండి ఆ బెంచ్‌కు నేతృత్వం వహించిన జడ్జి ఇప్పుడు లోక్‌పాల్! అవినీతి వ్యతిరేకత ముసుగులో రాజకీయ వైరాల్ని లెక్క తేల్చుకోవటానికి ఇలా ఒక అమానుషమైన చట్టాన్ని వాడుకున్నారు. ఈ క్రమంలో 'జెయిల్ కాదు బెయిల్' అనే ప్రాథమిక సూత్రం మరుగున పడిపోయింది. ప్రతీకార రాజకీయాలు చట్టబద్ధత పొందాయి. అందుకే చెప్పేది– స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఇదివరకెన్నడూలేని ఎన్నికల యంత్రాంగం మద్దతుతో నిలబడిన ఈ రాజకీయ నాయకుడిని ఎదుర్కోవటానికి ప్రతిపక్షాలు చేపడుతున్న 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం' లాంటి ప్రదర్శనలు చాలవు, అంతకుమించి కావాలి.

తాజా కలం: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఒక సర్వే ప్రకారం 67శాతం మంది భారతీయులు 'పార్లమెంట్ జోక్యం గానీ కోర్టుల జోక్యం గానీ లేకుండా ఒక బలమైన నాయకుడు నిర్ణయాలు తీసుకోగలిగే వ్యవస్థ దేశానికి అవసరం' అని కోరుకుంటున్నారు. ఇలా కోరుకునేవారి సంఖ్య 2017లో 55శాతం ఉండేది. మరి ఇక ప్రజాస్వామ్యానికి దిక్కేది?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

భారతరత్నతో గౌరవించాలి

ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్. జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానులుగా చేయాలన్నదే ఆయన లక్ష్యం. బిహార్‌లోని షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో 1908 ఏప్రిల్ 5న శోభిరామ్, బసంతి దేవిలకు జగ్జీవన్ రామ్ జన్మించాడు. ఆయన చదువుకున్న పాఠశాలలో మొదటిసారిగా అంటరానితనాన్ని అనుభవించాడు. ఆ పాఠశాలలో విద్యార్థుల కోసం మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తూ రెండు కడవలపై 'హిందూ పానీ', 'ముస్లిం పానీ' అని రాసి ఉంచేవారు. జగ్జీవన్‌రామ్ హిందూ పానీ కడవలో మంచినీరు తాగారని హిందూ విద్యార్థులు ఆ కుండలోని నీరు తాగేవారు కాదు. ఈ ఉదంతంతో ఆగ్రహించిన ఆయన ఒక రాయి విసిరి ఆ కుండను ముక్కలు చేశాడు. అప్పుడు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 'హరిజన పానీ' అనే మరో కుండను ఏర్పాటుచేశాడు. జగ్జీవన్‌రామ్ ఆ కుండని కూడా పగులకొట్టాడు. ఇక చేసేదేమీ లేక ఆ పాఠశాల వారు ఒకే కుండను ఏర్పాటుచేశారు. ఈ సంఘటనలో గెలిచినా ఆయన గుండె ఆవేదనతోనూ, కోపంతోనూ నిండిపోయింది. ఆ అనుభవాలే ఆయన దళిత జనుల జాగృతివైపు ముందుకు సాగడానికి ప్రేరణనిచ్చాయి.



విద్యార్థి దశలోనే గాంధీజీ అహింసా మార్గానికి ఆకర్షితుడై 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. 57 ఏళ్లపాటు పార్లమెంటును ఏలిన మహా అనుభవశీలి ఆయన. వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య, రైల్వే శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అందించారు. జగ్జీవన్‌రామ్ తాను చేపట్టిన ప్రతీ బాధ్యతలోనూ తనదైన ముద్రవేసిన కార్యదక్షుడు. బ్రిటీష్ రైల్వే వ్యవస్థను ప్రక్షాళన చేసి భారతీయ ముద్ర వేశారు. 1967–70లో ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత మండలాలను అభివృద్ధి చేసి మొదటిసారి భారతదేశం ఆహార స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా చేసి, దేశాన్ని కరువు బారి నుంచి కాపాడారు. 1970–74లో రక్షణ శాఖ మంత్రిగా పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేసి, పాకిస్తాన్ సేనలు బేషరతుగా లొంగిపోయేలా చేశారు.

జగ్జీవన్‌రామ్‌లో ఉన్న తన వారికి చేయాలనే ఆరాటం.. పోరాటం ఇప్పుడు ఉన్న దళిత ఎంపీ, ఎమ్మెల్యేలు అలవరుచుకోవాలి. దళితుల హక్కులను రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిస్తే, వాటిని చట్ట రూపంలో అమలుచేయడానికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిది. అవమానాలు, ఆటంకాలను విజయాలుగా మలుచుకున్న నిజమైన దేశ నాయకుడు జగ్జీవన్‌రామ్. అందుకే ఆయన భవిష్యత్తు తరాలకు కూడా ఆదర్శవంతుడు. ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన 1986 జూలై 6న కన్నుమూశారు. ఆయన జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా సమతా దినోత్సవంగా జరుపుతోంది. దేశం కోసం.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, సాంఘిక సమానత్వం కోసం అణగారిన వర్గాల కోసం చివరి శ్వాస వరకూ కృషి చేసిన జగ్జీవన్‌రామ్‌ను భారతరత్నతో గౌరవించాలి.

– సంపత్ గడ్డం

విషమిస్తున్న మన విశ్వగురుత్వం!

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!



■ రాహుల్ కుమార్



ప్రపంచానికి భారత్ విశ్వగురువుగా మారుతోంది! నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం! ఎన్నింటిలో మనకు గురుపీఠం దక్కుతోందంటే టక్కున చెప్పలేం. ఒక విషయంలో మాత్రం అది కఠోర వాస్తవంగా మారింది. విశ్వగురు ప్రచారకర్తలు మాత్రం దీనిపై మౌనం వహిస్తున్నారు. కనీసంగా కూడా ప్రస్తావించటం లేదు. చర్చకూ ఆ విషయాన్ని రానివ్వటం లేదు. ఆదాయం, సంపద అనేవి సమాజ స్థాయిని అంచనా వేయటానికి కొలమానాలు. ఈ రెండూ దండిగా ఉండటం గొప్పే! కాదనలేం! కానీ అవి వివిధ ప్రజల మధ్య ఏ స్థాయిలో పంపకం అవుతున్నాయన్నది అంతకంటే కీలకమైంది. గౌరవప్రద జీవితానికి, మౌలిక అవసరాలు తీర్చుకోటానికి ఆ పంపకం ఎక్కువమందికి తోడ్పడుతుంటే దాన్ని న్యాయబద్ధంగా ఉందని అంటాం. ఈ న్యాయబద్ధతకు మనం ఎంత దూరంలో ఉన్నాం? ప్రభుత్వాల విధానాలు అందుకు తోడ్పతున్నాయా? 1950ల తర్వాత మనతో పాటే అభివృద్ధి దిశగా అడుగులు వేసిన దేశాలతో పోల్చితే మనం ఎక్కడ ఉన్నాం? వీటిని పరిశీలిస్తే విస్తుబోయే నిజాలు కనపడతాయి. ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక అసమానతలను ఎంతో లోతుగా విశ్లేషిస్తున్న వారిలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త టామస్ పికెటీ ఒకరు. మరో ముగ్గురు ఆర్థికవేత్తలతో కలిసి ఆయన భారత్‌లోని అసమానతలపై ఇటీవల ఒక నివేదికను రూపొందించారు. 1922 నుంచి 2023 వరకూ దేశంలో నెలకొన్న అసమానతలను మన కళ్లముందు ఉంచారు. 'భారత్‌లో ఆదాయం–సంపద అసమానతలు' అన్న పేరుతో రూపొందించిన ఆ నివేదిక పెద్దదేమీ కాదు. అంతా కలిసి 86 పేజీలే ఉంది.

ఆదాయం అంటే అందరికే తెలిసిందే. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేయటం ద్వారా డబ్బు రూపంలో మనకు లభించేది. సంపద అంటే భూములు, భవనాలు, షేర్లు, బంగారం, మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఉండేది. ఆదాయం, సంపద అనేవి మనుషుల జీవితాలను శాసిస్తాయి. మన సౌకర్యాలను అవే నిర్దేశిస్తాయి. ఈ రెండూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ ఒకేలా అందవు. ఇప్పుడే కాదు నాగరికత మొదలైన నాటి నుంచి ఈ పరిస్థితే ఉంది. యుగయుగాల్లో ఉద్యమాలు, పోరాటాలు, ప్రవక్తల బోధనలు, మత సంస్కరణలు ఏదో విధంగా వీటి చుట్టూనే తిరిగాయి. పంపిణీలో సముచిత వాటాల కోసం వివిధ రూపాల్లో చరిత్ర అంతా పెనుగులాటలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ వర్గాలకు అందే ఆదాయాన్ని, సంపదని నిర్దేశించటంలో తొలి నుంచీ ప్రభుత్వ వ్యవస్థే (స్టేట్) కీలకపాత్ర పోషిస్తూ వస్తోంది. అందుకే ఈ రెండింటి పంపకాల విషయంలో తీసుకునే చర్యలను, విధానాలను బట్టి ప్రభుత్వ స్వభావాన్ని అంచనా వేయవచ్చు. పికెటీ విశ్లేషణ ప్రకారం భారత్‌లో ప్రస్తుతం బిలియనీర్ రాజ్ నడుస్తోంది. ప్రభుత్వ చర్యలూ విధానాలూ బిలియనీర్ల చేతుల్లో ఆదాయం, సంపద పోగుపడేలా చేస్తున్నాయి.

ఆదాయం, సంపదలను లెక్కించటానికి ప్రధానంగా వయోజనులనే పరిగణనలోకి తీసుకుంటారు. వీరిలో పైమెట్టున ఉన్న ఒక శాతం (టాప్ 1%) జనాభా పరిస్థితినే చూద్దాం. 2022–23 మొత్తం ఆదాయంలో 22.6 శాతం వాటా ఈ వర్గం ప్రజలకు ఉంది. ఇక సంపదలో ఈ వర్గం వాటా 40.1 శాతానికి చేరుకుంది. గతంలో ఎన్నడూ ఒక శాతం ప్రజల చేతుల్లో ఇంతగా ఆదాయ, సంపద కేంద్రీకరణ జరగలేదు. ఈ వైపరీత్యానికి ఇంకో కోణం కూడా ఉంది. అదే మనకు విశ్వగురువు స్థానాన్ని ఖాయం చేస్తోంది. ఒక శాతం జనాభాకు ఆదాయపరంగా భారత్‌లో ఉన్నంత వాటా ఏ దేశంలోనూ లేదు. ఆదాయ అసమానతల్లో కొంతకాలం కిందటి వరకూ దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలు అగ్రభాగాన ఉండేవి. వీటిని భారత్ దాటేసింది. బ్రిటిషు వలస పాలన విపరీత ఆదాయ అసమానతకు పెట్టింది పేరు. ఆ పాలనలో సైతం 1922 నాటికి ఒక శాతం ధనికుల వాటా ఆదాయంలో 13 శాతం మాత్రమే ఉండేది. ఈ ఒక శాతం జనాభాని పక్కనబెట్టి.. పైమెట్టులోని మొత్తంగా 10 శాతం (టాప్ 10%) జనాభా ఆదాయ–సంపద లెక్కలు తీసుకున్నా పరిస్థితి ఘోరంగానే కనపడుతుంది. జాతీయ ఆదాయంలో 10 శాతం ప్రజల వాటా 2020 నాటికి 60 శాతానికి చేరింది. ఇక సంపదలోనూ 65 శాతం వాటా వారిదే.

మార్కెట్ అనుకూల ఆర్థిక సంస్కరణలతో వృద్ధిరేటు పెరిగింది. ఆదాయాలూ సంపదలూ పెరిగాయి. తలసరి ఆదాయం, కొనుగోలు శక్తిలో ఎదుగుదల కనపడింది. నాణేనికి ఇది ఒకవైపు చిత్రమే. మరోవైపు చూస్తే సంస్కరణల వల్ల అసమానతలూ విపరీతంగా పెరిగాయి. 1980ల మధ్యకాలం వరకూ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు కఠినంగానే ఉండేవి. పన్నుల భారమూ ఆనాడు అధికమే. వీటివల్ల ఇతర ఇబ్బందులు కలిగినా అసమానతలు కొంత అదుపులో ఉండేవి. ఉదాహరణకు 1950ల్లో పైమెట్టున ఉన్న 10 శాతం ధనికుల ఆదాయం 40 శాతం ఉంటే, 1980 నాటికి అది 30 శాతానికి తగ్గింది. ఆ తర్వాత నుంచి పెరగటమే తప్ప తగ్గిన దాఖలాల్లేవు.

పదిశాతం ధనికులకు సంబంధించిన గణాంకాల్లో ఈ విపరీత ధోరణిని చూసిన తర్వాత మిగతా 90 శాతం జనాభా ఆదాయ–సంపదల పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తకమానదు. 2022–23 నాటి పరిస్థితిని చూస్తే 50 శాతంగా (బాటమ్ 50%) ఉన్న కిందిస్థాయి ప్రజలకు ఆదాయంలో దక్కింది 15 శాతం వాటానే. గతంలో ఎన్నడూ ఇంత ఘోరమైన పరిస్థితి లేదు. 1990ల నాటికి ఈ వర్గానికి 22.6 శాతం వాటా ఉండేది. అంటే ఏడున్నర శాతం వాటా నికరంగా తగ్గిపోయింది. సంపద విషయాన్నే చూద్దాం. 1961–1981 మధ్య సంపదలో ఈ వర్గం వాటా 11.10 శాతం ఉంటే 2020 నాటికి అది 6–7 శాతానికి పడిపోయింది.

ఇక 40 శాతంగా ఉన్న మధ్యతరగతి (మిడిల్ 40%) విషయంలోనూ ఆదాయ వాటా తగ్గుదల స్పష్టంగా కనపడుతుంది. 1990ల నాటికి ఈ వర్గానికి ఉన్న 44.1 శాతం వాటా 2022 నాటికి 27.3 శాతానికి పడిపోయింది. సంపద వాటాలోనూ ఇదే ధోరణి కనపడుతుంది. 1981 నాటికి 40–45 శాతం వాటా ఉంటే 2023 నాటికి అది 29 శాతానికి దిగజారింది.

చైనాను, భారత్‌ను పోల్చిచూడటం ఈ మధ్య చాలా పెరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంలోనే గాక వస్తూత్పత్తిలో కూడా చైనాని అధిగమించాలన్న తపన కనపడుతోంది. ఇది ఎప్పటికి సాధ్యమో ఇప్పుడే చెప్పలేకపోయినా ఆదాయ అసమానతల్లో మాత్రం మనం చైనాను అధిగమించేశాం. ఒక శాతం ధనికుల ఆదాయం చైనాతో పోల్చితే భారత్‌లో 50 శాతం ఎక్కువ. పైమెట్టున ఉన్న 10 శాతం ధనికులతో పోల్చితే ఆ తేడా 35 శాతం ఉంది. ఇక్కడో మినహాయింపు ఉంది. సంపదలో మాత్రం చైనాలో 2011 నుంచి పదో వంతు జనాభా వాటా భారత్‌ను మించిపోవటం మొదలైంది.

అసమానతల ప్రభావం తెలుసుకోటానికి కొన్ని రంగాలకు సంబంధించిన విశేషాలను కూడా పికెటీ బృందం ప్రస్తావించింది. వాటిల్లో కొన్నిటినైనా చూడాలి. విమాన ప్రయాణాల్లో ఒక శాతం ప్రజల వాటా 46 శాతం ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే భారతీయుల సంఖ్య 2.6 శాతమే. 44 శాతం డిజిటల్ నగదు లావాదేవీలను 6.5 శాతం మందే చేస్తున్నారు. మూడో వంతు జొమాటో ఆర్డర్లు 5 శాతం మంది నుంచే వస్తున్నాయి.

మోదీ హయాంలోని వృద్ధిరేటుపై వివాదాలు చాలానే ఉన్నాయి. 2014 నుంచే దేశంలో స్వర్ణయుగం ప్రారంభమైందనే ప్రచారం ఊపందుకున్నా పికెటీ బృందం ఇచ్చిన లెక్కలు దానికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. 2015లో వాస్తవిక వృద్ధిరేటు 6 శాతం ఉంటే 2016కి వచ్చేటప్పటికి అది 4.7 శాతానికి పడిపోయింది. 2017–18లో అది 4.2 శాతానికి తగ్గింది. కరోనా సంవత్సరంలో 1.6 శాతానికే పరిమితమైంది. 2020లో మైనస్ 9 శాతానికి పడిపోయింది. 2021లో అది 9.1 శాతంగా కనపడినా దాన్ని సాధారణ వృద్ధిరేటుగా పరిగణించలేం. కిందటి ఏడాది మైనస్ వృద్ధిరేటు వల్ల ఆ ఎదుగుదల కనిపించింది. 2022లో పరిస్థితులు కుదురుకున్న తర్వాత వృద్ధిరేటు 4.7 శాతానికే పరిమితమైంది.

2014 తర్వాత బలపడుతున్న మరో పరిణామం గురించి ఇక్కడ చెప్పుకోవాలి. అసమానతలపై పట్టింపు తగ్గిపోవటం మొదలైంది. అంతకుముందులాగా చర్చలు దీనిపై జరగటం లేదు. దీంతో అసమానతలు సృష్టించే దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ ప్రభావాల పరిశీలనలు సైతం మందగిస్తున్నాయి. గణాంకాలను లోపభూయిష్టంగా రూపొందించటం, రాజకీయంగా రుచించని గణాంక సమాచారాన్ని జనంలోకి రానీయకుండా చేయటం 2014 తర్వాత బాగా పెరిగిన విషయాన్ని పికెటీ బృందం ప్రస్తావించింది.

విపరీత ఆదాయ–సంపద వ్యత్యాసాలు ప్రభుత్వం, సమాజంపై పైవర్గాలకు అనుచిత ఆధిపత్యాన్ని కలగచేస్తాయి. ఆదాయం–సంపదలో అగ్రభాగాన ఉన్న వర్గం.. ధనబలంతో రాజకీయాలను శాసించటం 1980ల తర్వాత విపరీతంగా పెరిగింది. పైమెట్టున ఉన్న 10 శాతం ప్రజల నుంచి వచ్చే ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రజాప్రతినిధుల ఈ నేపథ్యం ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వీటికి తోడు అసమానతలను ప్రశ్నించే పౌరసమాజ బృందాలను కట్టడి చేయటం బాగా పెరిగింది. ఇవన్నీ కలిసి దేశాన్ని ధనస్వామ్య భారత్‌గా మార్చివేస్తున్నాయి. విపరీత అసమానతల నుంచి వస్తున్న అసలు ప్రమాదం ఇదే. ఆర్థిక, సామాజిక న్యాయానికి విఘాతంగా పరిణమిస్తున్న వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వాలు పూర్తి విరుద్ధబాటలో నడుస్తున్న దృశ్యమే మనముందు మెదలుతోంది. ప్రజలకు ఇచ్చే తాయిలాలు, ఉచితాలు, జనాకర్షణ పథకాలు, నగదు పంపిణీలు.. ఏవీ కూడా ఆదాయ, సంపద అసమానతలపై ప్రభావం చూపలేకపోతున్నాయి.

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)




నల్లజర్లలో బాబు



మన జెండా ఎగరాలి..

కొవ్వూరులో పోటీచేసేది చంద్రబాబే : ముప్పిడి

గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి విధ్వంసకర పాలనతో ప్రజలు విసుగుచెందారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుకను అందించాం. వైసీపీ నిబంధనలు తుంగలో తొక్కి గోదావరిలో ఇసుకను దోచుకుంటున్నారు. దీంతో గామన్ బ్రిడ్జిపై స్తంభం కుంగింది. డ్రెడ్జింగ్ వల్ల ఇసుక, పడవ కార్మికులు ఉపాధి దెబ్బ తింది. హోంమంత్రి కొవ్వూరులో ఓటమి భయంతో గోపాలపురం వెళ్లిపోయారు. కొవ్వూరులో పోటీచేసేది నేను కాదు.. మన చంద్రబాబే.




మీతోనే మేమంతా : కొవ్వూరులో విక్టరీ సింబల్ చూపుతున్న యువత


బాబును చూడాలని : డాబాలపైకి ఎక్కిన జనం


అదిరిన రోడ్ షో : కొవ్వూరులో రోడ్‌కు ఇరువైపులా జనం

గాలి మాటలు నమ్మొద్దు.. మీ సంక్షేమానికి నాది హామీ

- రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు
- కూటమిని గెలిపించండి
- కొవ్వూరు అన్ని విధాలా అభివృద్ధి చేస్తా
- కొవ్వూరులో చెత్త గోపాలపురాన బంగారమా?
- ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేస్తా
- కొవ్వూరు, నల్లజర్లలో ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/కొవ్వూరు/నల్లజర్ల, ఏప్రిల్ 4 : కొవ్వూరు, నల్లజర్ల జనసంద్రమయ్యాయి. ఎటుచూసిన జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం తరలి వచ్చారు.. ఉదయం నుంచి తమ నాయకుడు చంద్రబాబు ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూశారు. మహిళలు, యువకులు, పెద్దలు తారతమ్యం లేకుండా సభలకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఇటు కొవ్వూరు పట్టణం.. అటు నల్లజర్ల జనంతో నిండిపోయాయి. కొవ్వూరు పట్టణంలోని దొమ్మేరు రోడ్‌లో మట్టే ప్రసాద్ రైస్‌మిల్లులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లో 4.30 గంటలకు చంద్రబాబు దిగారు. అక్కడ నుంచి కార్లు, బైక్‌లపై కార్యకర్తలు, నాయకులు మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు 2 కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ర్యాలీగా 5.20 గంటలకు విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించారు. కొవ్వూరు పట్టణానికి ఎన్నోసార్లు వచ్చా. ఈసారి మాత్రం ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ప్రజాగళం యాత్ర ద్వారా మీలో చైతన్యం తీసుకురావడానికి వచ్చిన నాకు ఆడబిడ్డలు, యువత, తమ్ముళ్లను చూస్తే ఏ మాత్రం అనుమానం లేదు. గెలుపు మనదే అన్నారు. గోదావరి పుష్కరాల్లో నేనే అభివృద్ధి చేశా. మళ్లీ హామీ ఇస్తున్నా కొవ్వూరు నా సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధి చేస్తా. మీ బాధ్యత సౌమ్యుడు, న్యాయవాది, సేవ చేయడంలో దిట్ట అయిన కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించండి. రాష్ట్రాన్ని కాపాడుకుందాం. అత్యధిక మెజార్టీ రావాలి. ఈ ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని బాబు కోరారు. ఏ ఒక్కరైనా వైసీపీ తరపున పనిచేస్తే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుకున్నట్టు అవుతుందన్నారు. పోలవరం నుంచి విజ్జేశ్వరం వరకు గోదావరిలో యంత్రాలతో డ్రెజ్జింగ్ చేసి ఇసుక తోడేయడంతో గామన్ వంతెన కుంగిపోయింది. హోంమంత్రిగా ఆమెకు అధికారాలు లేవుగాని, దోపిడీకి మాత్రం ఫుల్ అధికారాలు ఉన్నాయన్నారు. అత్యాచారాలపై ప్రశ్నిస్తే సాధారణంగా జరుగుతాయని బదులిచ్చిన హోంమంత్రి వనితకు ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. దొమ్మేరులో దళిత యువకుడిని అక్రమంగా అరెస్టు చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో దళితులు తిరగబడడంతో మంత్రి భయపడిపోయి పారిపోయిందన్నారు. కొవ్వూరులో చెత్త గోపాలపురంలో బంగారమా అన్నారు. ఇది న్యాయమా అన్నారు. జగన్మోహనరెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. నీ హోంమంత్రి కొవ్వూరులో గెలవకపోతే నిన్ను ఎందుకు గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. ధనార్జనే లక్ష్యం. అటువంటి దుర్మార్గుడు జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ప్రతి ఇంటిలో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో కలిసి ముందుకు సాగాలి. ఈ రాష్ట్రం కోసమే ఈ పొత్తు అన్నారు. 2022 ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదులు గట్టిగా పోరాడుతున్నారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడం మా ముగ్గురి బాధ్యత కాదు.. మనందరిదీ. కూటమిని గెలిపించండన్నారు. చంద్రబాబు నాయుడికి కొవ్వూరు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు ఘన స్వాగతం పలికారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు నాగలి, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి గద బహూకరించారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడికి చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జంక్షనులో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జగన్ ఎంతో మోసం చేసి ఏమీ తెలియనట్టు నంగనాచిగా మాట్లాడతాడు. ముందు సిద్ధమన్నాడు. హోర్డింగులు పెట్టాడు. ఒక్కొక్క మీటింగుకు 1500 బస్సులు. ఈ రాష్ట్రం వీళ్ల తాత జాగీరా? గోపాలపురం నుంచే పోలవరం కాలువ పోతోంది. ఈ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరం వంటిది. దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు. ఆ ప్రాజెక్టు ప్రమాదంలో పడితే తూర్పు, పశ్చిమ గోదావరి చాలా భయంకరంగా తయారయ్యే పరిస్థితి వస్తుంది. ఇప్పుడు పోలవరాన్ని జగన్ నాశనం చేశాడు. జగన్ స్వార్థానికి, అవినీతికి పోలవరం బలైపోయింది. నిప్పులాగా బ్రతికాం. జగన్ రాజకీయ కక్షతో బురద వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశంపై ఉమ్మి వేయడానికి చూస్తే అది ఆయన ముఖాన్నే పడుతుందన్నారు. ఎస్సీలకు నేను తీసుకొచ్చిన 27 పథకాల అమలు ఆపేశాడు. నా ఎస్సీలని అంటున్నావ్.. వాళ్లకు మేలు ఏం చేశావని అడుగుతున్నాం. జగన్ దళితులకు ఒక్క కార్యక్రమం కూడా చేయకుండా ద్రోహం చేశాడు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి సైకో. తూర్పుగోదావరిలో ఒక దళిత డ్రైవరును వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేశాడా లేదా?.. మాస్కు అడిగిన పాపానికి విశాఖలోని డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిని చేసి చంపేశారు. సీతానగరంలో ఇసుక దోపిడీపై ప్రశ్నిస్తే శిరోముండనం చేయించారు. ఎస్సీలను చంపిన వాళ్లను పక్కన పెట్టుకుని ఊరేగుతావా?. అందుకే రంపచోడవరంలో ఆ ఎమ్మెల్సీ వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయబోతే ఎస్సీ కుర్రాళ్లు వచ్చి ఉరికెత్తించారు, తరిమి తరిమి కొట్టారు. అతడిని ప్రోత్సహించింది జగన్. వైసీపీని పాతిపెట్టాలి. ఆ పార్టీని నామ రూపాలు లేకుండా చేసే బాధ్యత మీదే. ఆంధ్రప్రదేశ్ ఆదర్శం కావాలని ఉంది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచనతోనే మూడు పార్టీలు కలిసి పొత్తు పెట్టుకున్నాం. మమ్మల్ని అర్థం చేసుకొని ఆశీర్వదించండి. నష్ట పోయిన నా తెలుగు జాతిని ఆదుకోవడమే నా ఆలోచన. నాకు వేరే కోరికలేమీ లేవు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ, గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీను, పితాని సత్యనారాయణ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సుర్ణరాజు,బీజేపీ కన్వీనర్ మైనం వాసు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ళ శ్రీరామ్, జి.వి. ప్రసాద్, పరిమి రాధ, బీవీము త్యాలరావు, కాక్లర తులసి, అండ్రు అనిల్, గన్ని హరికృష్ణ, కరుటూరి ధనంజయ్, షేక్ మీరా సాహెబ్, యద్దనపూడి బ్రహ్మారాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, జమ్ముల సతీష్, గంటా శ్రీను, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరులో మాట్లాడుతున్న ముప్పిడి.. చిత్రంలో అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు



నల్లజర్లలోనే రాత్రి బస

నారా చంద్రబాబు నాయుడు నల్లజర్లలోనే రాత్రి బస చేశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్ హాల్‌కి వెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రముఖులతో కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహిస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నల్లజర్లలోనే ఉంటారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నల్లజర్ల హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో నరసాపురం బయలుదేరివెళతారు.

బాపిరాజుతో మాట్లాడతా..

జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుతో నేను స్వయంగా మాట్లాడతా.. మీరంతా కలిసి కట్టుగా పని చేసి పార్టీని గెలిపించాలి. 2009లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014లో జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించా.. బాపిరాజు పార్టీ కోసం బాగా పని చేశాడు. శుక్రవారం మాట్లాడి సమన్వయం చేస్తా. అందరూ కలసి సైకో జగన్‌ను ఓడించి ఫ్యాన్‌ను చిత్తు చిత్తు చేసి డస్ట్‌బిన్‌లో పడేయాలి.


కొవ్వూరులో రైతుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తూ..

రాజకీయ ఓనమాలు నేర్పింది చంద్రబాబే : మద్దిపాటి

అతిసామాన్యమైన దళిత కుటుంబం నుంచి వచ్చా.. చంద్రబాబు రాజకీయ ఓనమాలు నేర్పించి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. చదువుకున్న దళిత యువకులను ప్రోత్సహించి సముచిత స్థానం కల్పించాలని ఆరాటపడే వ్యక్తి చంద్రబాబు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే చంద్రబాబుకు మనమంతా అండగా ఉందాం. సూపర్ సిక్స్ ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. 74 ఏళ్ల వయస్సులో మండే ఎండలను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసం తపించే చంద్రబాబు కోసం మనం ఒక అడుగు ముందుకు వేయాలి. కూటమిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.


గోపాలపురంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకటరాజు


చంద్రబాబు బస చేసిన బస్సు వద్ద గుమిగూడిన నాయకులు, కార్యకర్తలు

ధీటైన వ్యూహాలతో ఓటర్ల ముందుకు వెళ్లండి!

- వైసీపీ వ్యతిరేక ప్రచారాలను తిప్పికొట్టాలి
- అమలాపురం లోక్‌సభ పరిధిలోని టీడీపీ అభ్యర్థులతో చంద్రబాబు సమీక్ష
- ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేసిన బాబు
- హాట్‌హాట్‌గా సాగిన అభ్యర్థులతో ముఖాముఖి
- నియోజకవర్గాల్లో టీడీపీ సమన్వయ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం
- కోనసీమ జిల్లాలో ముగిసిన చంద్రబాబు పర్యటన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లోక్‌సభతోపాటు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులతో కీలక సమీక్ష నిర్వహించారు. కేవలం అభ్యర్థులు మాత్రమే హాజరైన ఈ సమావేశంలో వారికి దిశానిర్దేశం చేశారు. ఒకరిద్దరు అభ్యర్థులకు క్లాస్ తీసుకున్నారు. ప్రత్యర్థి వైసీపీ పార్టీకి ధీటుగా వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళ్లాలని అభ్యర్థులను చంద్రబాబు ఆదేశించారు. నియోజకవర్గాల్లో ఉన్న గ్రూపు తగాదాలు, విభేదాలు అన్నింటినీ విస్మరించి అందరినీ కలుపుకుని వెళ్లాల్సిందేనని తీవ్ర స్వరంతో ఆదేశించారు. జిల్లాలో ప్రజాగళం పేరిట బుధవారం రావులపాలెం, ద్రాక్షారామంలో జరిగిన బహిరంగ సభల అనంతరం రాత్రికి రామచంద్రపురంలోని వీఎస్ఎన్ కళాశాలలో చంద్రబాబు బస చేశారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్సుల్లో బిజీగా గడిపారు. ఆ తరువాత అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ అభ్యర్థులతో భేటీ నిర్వహించారు. లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థులు వాసంశెట్టి సుభాష్ (రామచంద్రపురం), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట), బండారు సత్యానందరావు (కొత్తపేట), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), దాట్ల బుచ్చిబాబు (ముమ్మిడివరం)తోపాటు జోన్-2 టీడీపీ ఇన్‌చార్జి సుజయకృష్ణరంగారావు, పొలిట్‌బ్యూర్ సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి తదితరులు బాబు నిర్వహించిన కీలక భేటీలో పాల్గొన్నారు. నియోజకవర్గాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితులపై ఆయన ఆరా తీసినట్టు తెలిసింది. ప్రధానంగా నియోజకవర్గాల్లో గ్రూపులకు అతీతంగా టీడీపీ అభ్యర్థులు పనిచేయాలని, జనసేన, బీజేపీ శ్రేణులను సమైక్యం చేసుకుని ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులపై దిశానిర్దేశం చేవారు. ఎక్కడైనా వివాదాలు ఉత్పన్నమైతే సీనియర్లు జోక్యం చేసుకుని వాటిని పరిష్కరించాలని సూచించినట్టు తెలిసింది. ఇక వైసీపీ నేతలతోపాటు సీఎం జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యూహాత్మక వ్యవహారాలపై పార్టీ శ్రేణులు నిరంతరం నిఘా ఉంచాల్సిందిగా బాబు ఆదేశించారు. ఎప్పటికప్పుడు వారికి కౌంటర్లు ఇస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిందిగా ఆదేశాలిచ్చారు. కోనసీమ జిల్లాలో ఉన్న టీడీపీ నేతలు వైసీపీకి ధీటుగా కౌంటర్ ఇవ్వడంలో వెనకబడ్డారని బాబు పేర్కొన్నట్టు తెలిసింది. టీడీపీ నేతలు సైతం వాగ్దాటిని పెంచుకుని ఓటర్లను ఆకట్టుకునే రీతిలో ప్రచారాలు చేసుకోవాలని సూచించారు. ఇక రాజోలు అసెంబ్లీ నియోజవర్గంలో ఉన్న పరిస్థితులను ఆరా తీసిన చంద్రబాబు నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులతోపాటు మరో ఐదుగురితో సమన్వయ కమిటీ ఏర్పాటుచేయాల్సిందిగా సూచించినట్టు సమాచారం. పి.గన్నవరం నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి పోటీ చేస్తున్నందున అక్కడ కూడా టీడీపీ తరపున త్రిమెన్ కమిటీని ఏర్పాటుచేసి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని సమన్వయం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పార్టీ నేతలను ఆదేశించారు. ఇక అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో జనసేన పార్టీ ఇన్‌చార్జిలు పార్టీకి రాజీనామా చేసినప్పటికీ ఆ కేడర్ మాత్రం చెక్కుచెదరకుండా టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తోందని ఆ నియోజకవర్గ అభ్యర్థులు చంద్రబాబుకు చెప్పారు. ప్రస్తుతం పరిస్థితుల నేపథ్యంలో ఇన్‌చార్జిల నియామకంతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో పర్యటించేలా ఏర్పాట్లుచేయాలని చంద్రబాబునాయుడును దాట్ల బుచ్చిరాజు, అయితాబత్తుల ఆనందరావులు కోరినట్టు తెలిసింది. అందుకు చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించి ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్‌కల్యాణ్ ఆ నియోజకవర్గాల్లో పర్యటించాల్సిందిగా కోరడానికి సుముఖత వ్యక్తంచేసినట్టు తెలిసింది. మండపేటలో పరిస్థితులపై అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుతో మాట్లాడినప్పుడు వివిధ అంశాలపై చర్చించుకున్నారని సమాచారం. రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై స్థానిక నేతలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు సూచించినట్టు తెలిసింది. కమిటీ ఏర్పాటుపై కూడా చర్చించినప్పటికీ ఒక కీలక వ్యక్తికి కమిటీలో స్థానం కల్పించడానికి కొందరు అభ్యంతరం పెట్టినట్టు సమాచారం. బీసీల నుంచి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని పార్టీ పొలిట్ బ్యూరోలోకి తీసుకున్నందున ఆయన నియోజకవర్గంలోని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాల్సిందిగా చంద్రబాబు సూచించినట్టు సమాచారం. లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌ల పనితీరు, వాగ్దాటి మెరుగుపరుచుకోవడంతోపాటు కేడర్‌ను ఆకట్టుకునేలా పనిచేయాల్సిందిగా బాబు సూచించినట్టు తెలిసింది. సమీక్ష అనంతరం జిల్లాకు చెందిన పోటీలో ఉన్న అభ్యర్థులతో చంద్రబాబు ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించినట్టు తెలిసింది. కొన్ని కీలక అంశాలపై ఒకరిద్దరు అభ్యర్థులపై చంద్రబాబు మండిపడినట్టు సమాచారం. ఇక పార్టీలో చేరికలకు సంబంధించి సమాచారం లేకుండా కోనసీమలోని కొందరు టీడీపీ నేతలు ఎవరికి వారే నిర్ణయించుకుని తనతో కండువాలు వేయించుకునే కార్యక్రమం నిర్వహించడంపై అధినేత బాబు వారిపై అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం వీఎస్ఎన్ కళాశాల నుంచి కాన్వాయ్‌లో బయలుదేరిన చంద్రబాబు ముచ్చుమిల్లిలోని హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడ టీడీపీ శ్రేణుల వీడ్కోలు అనంతరం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ప్రజాగళం బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, సుజయకృష్ణరంగారావు పాల్గొన్నారు.


ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

లారీని ఢీకొన్న కారు

అక్కడికక్కడే బావాబామ్మర్దుల దుర్మరణం.. తాళ్లూరులో ఘటన

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఘోర ప్రమాదం

పెందుర్తి వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు

పెళ్లి వేడుక నుంచి వస్తుండగా విషాదం

మృతుల్లో తండ్రి, కొడుకు

- 7లో

వైసీపీ వలయంలో వలంటీర్లు



- వైసీపీ కుట్రలో వలంటీర్లు సమిధలు
- వాళ్ల వేలితో వాళ్ల కన్నునే
- పొడిపించే కుట్ర
- ఐదేళ్ల నుంచి 'సొంత' పనులకు
- ఎన్నికల వేళ 'కార్యకర్త'లుగా
- టీడీపీపై బురద జల్లే ప్రయత్నం
- తిరిగొచ్చి జగన్ ముఖంపై పడిన వైనం
- వలంటీర్లను దూరం పెట్టడం సబబేననే కోర్టు
- తీర్పుతో మళ్లీ ఛీ కొట్టించుకున్న పాలకులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ తన రాజకీయ కుట్రలో భాగంగా వలంటీర్లను సమిధలుగా వాడుకొంటున్నారు. వారి వేలితో వారి కంట్లోనే పొడుస్తున్నారు. తమకు అధికారం చిక్కితే యువతకు లక్షల ఉద్యోగాలు ఇచ్చేస్తామంటూ గత ఎన్నికల్లో జగన్ ఊదర గొట్టారు. తీరా అధికారం చేజిక్కించుకొన్న తర్వాత అవన్నీ 'గాలి' మాటలని తేలిపోయింది. లక్షల ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఝలక్ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీరు వ్యవస్థను తెచ్చారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం పీజీ చేసిన యువ తను సైతం 'వలంటీరు' పేరుతో పక్కదారి పట్టించారు. దీంతో యువత ఐదేళ్ల కాలాన్ని వృథా చేసు కొంది. తీరా ఎన్నికల వేళ కూడా వాళ్లను మానసికంగా ఇబ్బందులకు గురిచేసే కుతంత్రానికి తెరతీశారు. ఆ బురద అంతా టీడీపీపై నెట్టేయాలని ప్లాన్ వేశారు. కానీ న్యాయస్థానం తీర్పుతో ఆ బురద రివర్స్ వచ్చి 'ఫ్యాను'పైనే పడింది.

రాజీనామా డ్రామా

వలంటీర్లను ప్రభుత్వం ఇంకా నలిపేస్తోంది. ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి పూర్తి స్థాయి కార్యకర్తలుగా వినియోగించుకునే దుష్టనీతికి తెరతీసింది. ప్రతి నియోజకవర్గంలో వైసీపీకి బాగా అనుకూలంగా ఉండే కొంతమంది వలంటీర్లతో రాజీ నామాలు చేయించి.. వారికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ అనధికారికంగా జీతం రూపేణా ముట్టజెప్పాలని వైసీపీ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ కేవలం రూ.5 వేలు మాత్రమే జీతంగా.. కాదు.. గౌరవ భృతిగా చెల్లించారు. గౌరవ భృతి సరిపోక తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఈ ఐదేళ్లలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి వలంటీర్లు మొరపెట్టుకున్నారు. అయినా వారి గోడును పట్టించుకున్న వైసీపీ నాయకులే లేరు. ఎన్నికల వేళ మాత్రం వలంటీర్లను నెత్తిన పెట్టుకుని చూసుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల రాజకీయ కుట్రలో సమిధలుగా మారిపోయారు. ఇప్పుడు మరో మోసానికి వైసీపీ తెరతీసింది. ప్రభుత్వంపై వలంటర్ల ఆగ్రహాన్ని అణగదొక్కడానికి ప్రలోభాలతో ఆశ పెడుతున్నారు.

టీడీపీపై నిందలా?

వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే లక్షలాది ఉద్యోగాలు కల్పించామని చెప్పుకోడానికి యువతను వలంటీరు పేరుతో మభ్య పెట్టింది. ఉన్నత చదువులు ఉన్న వారు సైతం మనసు చంపుకొని 'సేవ' చేస్తూ వచ్చారు. వలంటీర్లను ఎన్నికల వేళ మరింత అనుకూలంగా వాడుకోవాలని పన్నాగం వేసింది. ఇది గమనించిన ఎన్నికల సంఘం వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి దూరం పెట్టింది. వలంటీర్లు తమ సొంత సైన్యమని జగన్, వలంటీర్లు వైసీపీ కోసమే పని చేయాలని వైసీపీ నాయకులు పదేపదే బహిరంగంగా ప్రకటించడం కూడా ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లు లేకుండా చేసింది. ఇవేమీ వలంటీర్లు పసిగట్టకుండా ప్రభుత్వం రోజుకో నాటకం తెరపైకి తెస్తోంది. టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేసి లబ్ధి పొందాలని చూస్తోంది. పింఛన్ల పంపిణీని సైతం ఆ కుట్రకు వాడుకొంది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు లేకపోతే తీవ్రమైన ఇబ్బందులు వస్తాయంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు మొదలుపెట్టింది. ఓ వైపు అన్యాయమైన దారిలో నడుస్తూ న్యాయం కావాలంటూ తమకు అనుకూలమైన వారితో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయించడం ద్వారా కోర్టును ఆశ్రయించింది. ఈసీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది. కోర్టు కూడా ఈ అభ్యర్థనను తప్పు బట్టింది. వలంటీర్లు లేకుండా మిగతా రాష్ట్రాల్లో పింఛన్లు ఇవ్వడం లేదా? అని ఆక్షేపించింది. ఈసీ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవించింది. దీంతో జగన్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లు అయ్యింది. తాను టీడీపీపై వేద్దామను కున్న బురద తిరిగొచ్చి తన ముఖంపైనే పడడంతో మిన్న కుండిపోయారు. వాస్తవానికి వలం టీర్లను టీడీపీ అధినేతగానీ, టీడీపీ నాయకులు గానీ కించపరిచిన, నిందించిన సందర్భాలు లేవు. వైసీపీ తమ రాజకీయ లబ్ధి కోసం యువతను వలంటీరు పేరుతో మోసం చేస్తోంది.

అసలుకే ఎసరు

వలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో వినియోగించడానికి వీల్లేదని ఎన్నికల సంఘం ఉత్తర్వులివ్వడంతో వైసీపీ పెద్దలు కొత్త కుతంత్రానికి తెరతీశారు. ఇప్పటి వరకూ వలంటీర్లపై లేని ప్రేమ ఒక్కసారిగా తన్నుకొచ్చింది. ఓట్లు దండుకొనే కుట్రలో భాగంగా మమకారం ముంచుకొచ్చింది. వలంటీర్లను కొందరిని తొలగించి, మరికొందరితో రాజీనామాలు చేయించి వైసీపీ కార్యకర్తలుగా వాడుకోవాలనే దురుద్దేశాన్ని అమలు చేస్తోంది. ఐదేళ్ల నుంచీ వలంటీరు పరిధిలోని కుటుంబాలతో వారికి కొంత అనుబంధం ఏర్పడింది. వైసీపీ నాయకులకూ ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో వలంటీర్లతో ఓటర్లకు ఉన్న అనుబంధాన్ని రాజకీయంగా వాడుకోవడానికి ప్లాన్ వేసింది. దీనిలో భాగంగా ఇన్నాళ్లూ పైసా జీతం పెంచడం చేతగాని పాలకులు ఇప్పుడు వలంటర్లతో రాజీనామాలు చేయించి వేల రూపాయలు ఆశ చూపుతున్నారు. వైసీపీ కోసం పని చేయాలంటూ అనధికార ఆదేశాలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన మార్చి 16 తర్వాత నుంచీ వలంటీర్ల రాజీనామాలు ఆరంభమయ్యాయి. అంతకు ముందు వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక వలంటీర్లు రాజీనామా చేసి వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు వందల్లో రాజీనామాలు చేస్తున్నారు. రాజీనామా లేఖల్లో కూడా టీడీపీపై ఆరోపణలు చేయాలని వైసీపీ నాయకులు చెప్పడంతో రాజీనామా లేఖలన్నీ అదే మాదిరిగా ఉండడం గమనార్హం. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లను 'సేవ' నుంచి తొలగించారు. వైసీపీ నాయకుల గాలి మాటలకు తలొగ్గి కొందరు రాజీనామాలు చేస్తున్నారు. తర్వాత వీరి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరు తమ ఉద్యోగం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశమూ లేదు. తమకు ఎలాగోలా పీడ వదిలిందని.. మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించుకుంటామని కొందరు వలంటీర్లు పరిచయస్తుల వద్ద ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



జిల్లాలో ఇప్పటివరకూ 174 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ 18, సీతానగరం 5, కడియం 87, దేవరపల్లి 8, రాజమహేంద్రవరం రూరల్ 9, తాళ్లపూడి 12, నల్లజర్ల 1, గోపాలపురం మండలం నుంచి 34 మంది తమ ఉద్యోగాలు వదులుకున్నారు. అయితే అందరూ విచిత్రంగా ఒకే కారణం చూపారని తెలుస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కారణంగా 26 మంది వలంటీర్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 32 మంది రాజీనామా చేయగా

జిల్లాల వారీగా పరిస్థితి..

31 మందిని అధికారులు తొలగించారు. కాకినాడ జిల్లాలో ఇద్దరు రాజీనామా చేయగా 9 మందిని అధికారులు తొలగించారు. ప్రజాప్రతినిధులు నిబంధనలు పాటించకుండా వలంటీర్లను బలి చేశారు. ఆయా ప్రజా ప్రతినిధులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ సమావేశం పెట్టి మరీ వైసీపీ కోసం పని చేయాలని వలంటీర్లను మౌఖికంగా ఆదేశించారు. వాస్తవానికి ఆ సమావేశానికి వెళ్లడానికి వలంటీర్లు నిరాకరించినా ఎంపీ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. అధికారులు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశానికి వెళ్లక తప్పలేదు. పాపం ప్రజాప్రతినిధి చేస్తే ఫలితం వలంటీర్లు అనుభవిస్తున్నారు. ఇలా మొదటి నుంచీ వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను వేధిస్తోంది.

లారీని ఢీకొన్న కారు



- అక్కడికక్కడే బావాబామ్మర్దుల దుర్మరణం
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

గండేపల్లి, ఏప్రిల్ 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని తాళ్లూరు హోటల్ ముందు ఆగి ఉన్న లారీని షిఫ్ట్‌కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో బావాబామ్మర్దులు అక్కడికక్కడే మృతిచెందారు. అన్నవరం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన తమ్మిన సుబ్బారావు(42), తెలంగాణ రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన చేకూరి పల్లయ్యచౌదరి (53) కలిసి బుధవారం రాత్రి రాజమండ్రిలోని బంధువుల ఇంట వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తెలిసిన బంధువు ఒకరు అన్నవరంలో ఉండడంతో గురువారం తెల్లవారుజామున అన్నవరం బయలుదేరారు. అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గండేపల్లి మండలం తాళ్లూరు వచ్చేసరికి సుమారు రెండుగంటలన్నర సమయమైంది. ఆ సమయంలో తాళ్లూరులోని హోటల్ ముందు లారీ డ్రైవర్ భోజనం కోసం లారీని పక్కన ఆపి భోజనం చేస్తున్న సమయంలో కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. కారు సగభాగం లారీ కిందకి వెళ్లిపోయింది. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయినప్పటికీ అవి వారి ప్రాణాలను రక్షించలేకపోయాయి. దీంతో ఇరువురు కారులో లారీ కిందే చిక్కుకుపోయారు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురై అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీయడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కారు లారీ కిందకు వెళ్లిపోవడంతో బయటకు రాలేదు. జేసీబీ సాయంతో కారును బయటకు లాగి కారులో ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతి చెంది ఉన్నారు. దీంతో ఈవిషయాన్ని కుటుంబసభ్యులకు చేరవేయడంతో వారు సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు. ఎప్పుడూ అందరితో కలిసి ఉంటూ ఎవరికి ఏ కష్టమొచ్చిన ఆదుకునే వారిని మృత్యువు వెంటాడడాన్ని బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహాలను పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆధారం బట్టి నిద్రమత్తులోనే ప్రమాదం జరిగి ఉండవచ్చన్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.



పల్లయ్యచౌదరి మృతదేహం



సుబ్బారావు మృతదేహం

ఘోర ప్రమాదం

- పెందుర్తి వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా ప్రమాదం
- మృతుల్లో తండ్రి,కొడుకు



అతికష్టం మీద బయటకు తీస్తున్న దృశ్యం



రోడ్డుపై క్షతగాత్రులు

పెందుర్తి/తాళ్లపూడి, ఏప్రిల్ 4: విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (17) చింతాడ ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఆనందరావు కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా అతని కుమారుడు చంద్రశేఖర్ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు.



ఆనందరావు



చంద్రశేఖర్



ఇందు

ద్రాక్షారామ ఈవోకు షోకాజ్ నోటీసు

ద్రాక్షారామ, ఏప్రిల్ 4: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం ఈవోకు ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించడం లేదని రామచంద్రపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో శిలాఫలకాలు మూసివేయకపోవడం, రాజకీయ పార్టీలకు పులిహోర పంపిణీ చేయడం, దేవస్థానం క్యాలెండరులో రాజకీయ నాయకుల ఫొటోలు ఉంచడం వంటి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించకపోవడంపై రిటర్నింగ్ అధికారి తీవ్ర హెచ్చరికలు జారీచేస్తూ నోటీసు అందిన 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుపై పరిశీలన జరిపి ఈవోకు నోటీసులు జారీ చేశారు.

హోరాహోరీగా ప్రో కార్ట్ రేసింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి



విజేతలతో ఆదిత్య బృందం

గండేపల్లి, ఏప్రిల్ 4: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయస్థాయి ప్రో-కార్టింగ్ ఎండురెన్స్ చాంపియన్‌షిప్-2024 సీజన్-4 పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌లకు సంబంధించి 350 మంది సభ్యులు హాజరయ్యారు. కోకోకోలా, అల్టాయిర్, ఫ్లైమాస్టర్ కంపెనీల సంయుక్త సౌజన్యంతో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో మహారాష్ట్రకు చెందిన పీవీడీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ట్రోజన్) టీమ్ విజేతగా నిలిచి రూ.లక్ష, ఎండురెన్స్ విన్నర్ రూ.85 వేలు నగదు బహుమతి సొంతం చేసుకుంది. రన్నరప్‌గా రఘు ఇంజనీరింగ్ కళాశాల(ఎనిగ్మాటిమ్) రూ.50 వేలు, ఎండురెన్స్ రన్నరప్ రూ.50 వేలు గెలుపొందింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మెకానికల్ విభాగం అధిపతికి, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, స్పాన్సర్ కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, కోఆర్డినేటర్లు డాక్టర్ శరవణన్, డాక్టర్ భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం కేసులో ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం, ఏప్రిల్ 4: మద్యం తరలిస్తున్న ఇద్దరిని, మద్యం అందించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాట్రేనికోన మండలం కందికుప్ప మద్యం షాపు నుంచి కందికుప్పకు చెందిన పినపోతు ధర్మారావు, దొంతికుర్రుకు చెందిన కొమ్మాబత్తుల బాబాసాహెబ్‌అంబేడ్కర్‌లు 223 మద్యం సీసాలను పల్లం తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. షాపు సూపర్‌వైజర్, గ్రామస్థాయి ప్రజాప్రతినిధి కుమారుడు నాతి కవిరాజు మద్యం సీసాలు ఇచ్చినట్లు నిందితులు తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ రామారావు తెలిపారు. కవిరాజును తప్పించేందుకు అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఎస్ఈబీ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్టు సమాచారం.

18 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

తుని రూరల్, ఏప్రిల్ 4: గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో బ్యాగ్‌లో గంజాయి ప్యాకెట్లు నింపుకుని ఒడిసాకు చెందిన సంజిత్ లిమ్మ అనే వ్యక్తి సికింద్రాబాద్ వెళ్తున్నాడు. అయితే గంజాయి కొనుగోలు చేసే వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో లిమ్మ తుని రైల్వేస్టేషన్‌లో గంజాయితో పాటు దిగాడు. ఆ గంజాయిని తునిలో అమ్మడానికి ఎదురు చూస్తుండగా ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్ పరిశీలించగా 18 కిలోల 390 గ్రాముల గంజాయి, రూ.92 వేలు పట్టుబడింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.గోవిందరావు, కానిస్టేబుల్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

పండితులు, అధికారుల ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలిరానున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో సత్యనారాయణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై ప్రణాళికను రూపొందించారు. గురువారం దివ్యకల్యాణ మహోత్సవానికి సంబంధించి పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ పందిరిరాట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. 18 గురువారం స్వామివారి ధ్వజారోహణ, దర్శనములు, 19 ఏకాదశి శుక్రవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణం, 20 శనివారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 21 ఆదివారం సదస్యం, 22 సోమవారం గౌతమి గోదావరి నదిలో తెప్పోత్సవం, 23 మంగళవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, 24 బుధవారం స్వామివారి శ్రీపుష్ప మహోత్సవంతో స్వామివారి ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు 21న పరీక్ష

కాకినాడ రూరల్,ఏప్రిల్ 4: కాకినాడ జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు శంఖవరం, హంసవరంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు పనిచేస్తున్నాయో ఆ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని 5వ తరగతి స్థాయిలో ప్రవేశ పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో ఉంటుందని తెలిపారు. దరఖాస్తు తేదీని ఈనెల 6 వరకూ పొడిగించామన్నారు. వివరాలకు 9491249321, 70329 96442లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం



రాయవరం, ఏప్రిల్ 4: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌదాసాగర్ గీసిన జగ్జీవన్‌రామ్ చిత్రపటం ఆకట్టుకుంది. వివిధ రకాల రంగులతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చిత్రకారుడు తెలిపాడు.

కేసు తారుమారుపై విచారణకు ఆదేశం

గొల్లప్రోలు, ఏప్రిల్ 4: మద్యం స్థానంలో బీరు పెట్టి ఎస్ఈబీ పోలీసులు కేసు తారుమారు చేసిన వ్యవహారంపై విచారణకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గొల్లప్రోలులో ముగ్గురు వ్యక్తుల వద్ద మద్యం స్వాధీనం చేసుకుని ఆస్థానంలో బీరు సీసాలు ఉంచి ఒక్కరినే అరెస్టు చూపడంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఐజీ ఆరా తీశారు. దీంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. దీంతో ఆమె విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వృద్ధుల ఇంటికెళ్లి పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు, ఏప్రిల్ 4: మండలంలోని 17 గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో అధికారులు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ప్రతీ పంచాయతీ, సచివాలయాల్లో సిబ్బంది 10 నుంచి 15 మంది దాకా ఉన్నా ప్రభుత్వం సానుభూతి పొందేందుకు పింఛన్లు ఇవ్వకుండా అనేక కథలు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నుంచి మార్పు వచ్చింది. సచివాలయ ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేసి వృద్ధులకు పింఛన్లు అందించారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికెళ్లి మరీ పింఛన్ అందించారు. చొల్లంగిలో ఉండ్రు నూకాలమ్మ అనే వృద్ధురాలు కుర్చీ సాయంతో వస్తుంటే వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు ఎదురెళ్లి పింఛన్ అందించారు. అలాగే యేసూరి సూర్యాకాంతం అనే వృద్ధురాలు మంచంపై లేవ లేని పరిస్థితిలో ఉండడంతో ఆమెకు వెల్ఫేర్ అసిస్టెంట్ దగ్గరకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు.

స్వామిప్రసాద్‌కు పడాల అవార్డు

మండపేట ఏప్రిల్ 4: తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషికి ద్వారపూడి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు స్వామిప్రసాద్ పడాల రామారావు అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున నుంచి అవార్డును అందుకున్నారు. అరసం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, పలువురు ప్రముఖులు, సాహితీ ప్రియులు ప్రసాద్‌ను అభినందించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి





అంతర్వేది: జనసేనలో చేరుతున్న దృశ్యం, కాట్రేనికోన: దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలోకి చేరికలు

రాజోలు కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పొట్టిలంక, యలకల్లంక, కొండుకుదురు, ఎస్.మూలపొలం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టూరి శ్రీనివాస్,మద్దాల సుబ్బారావు, సయ్యపురాజు సత్యనారాయణరాజు, కుడుపూడి బుజ్జి, పోలిశెట్టి రాజేష్, మామిడిపల్లి తాతయ్యనాయుడు, జంగా డేవిడ్‌రాజు, పంతాడి శ్రీనివాస్, కోనే రామకృష్ణారావు, సలాది ప్రసాద్, మేడిద దుర్గాప్రసాద్, తొత్తరమూడి ప్రభాకరరావు, బొబ్బా ప్రభాత్‌కుమార్, మతుకుమిల్లి బాబూరావు, వారా లక్ష్మీనరసింహరామ్, అడపా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

అంతర్వేది, ఏప్రిల్ 4: సఖినేటిపల్లిలంక గ్రామం నుంచి ఉమ్మడి అభ్యర్థి దేవవరప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు వరప్రసాద్‌తో కలిసి గ్రామాల్లో పర్యటించారు. జనసేనలో పలువురు చేరారు. ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, అయినవిల్లి సత్యనారాయణ, రేపూరి ఏసు, అయ్యాజీవేమా, యాళ్ల దొరబాబు, రాపాక రమేష్‌బాబు, గుండుబోగుల పెద్దకాపు, గెద్దం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీటీసీతో సహా వైసీపీ నుంచి టీడీపీలోకి

కాట్రేనికోన, ఏప్రిల్4: బలుసుతిప్పకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు గురువారం ఆ పార్టీని వీడి తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో చేరికలు జరిగాయి. చేరినవారిలో ఎంపీటీసీ ఓలేటి ధర్మారావు, ఓలేటి బాపూజీ, కామాడి నందం, కామాడిఅచ్చియ్య, ఓలేటి గంగాద్రి, సంగాని ధర్మారావు, ఓలేటి నందం ఉన్నారు.

చంద్రబాబును కలిసిన రిష్వంత్‌రాయ్



రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును గురువారం వీఎస్ ఎం కళాశాలలో మర్యాదపూర్వకంగా తండ్రి రాగూర్‌తో వెళ్లి తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వంత్ రాయ్ కలిశారు. పార్టీ విజయానికి ఉత్సాహంతో పనిచేయాలని చంద్రబాబు సూచించినట్లు రిష్వంత్ తెలిపారు.

రజతోత్సవ వేడుకలకు నాగజ్యోతికి ఆహ్వానం



ఐ.పోలవరం, ఏప్రిల్ 4: మురమళ్లకు చెందిన ఉపాధ్యాయురాలు, రచయిత్రి, కవయిత్రి దొండపాటి నాగజ్యోతికి మద్రాసు విశ్వవిద్యాలయ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించింది. వేడుకలకు దేశవ్యాప్తంగా 60మందిని ఎంపిక చేశారు. విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన శుక్రవారం మెరీనా బీచ్ సమీపంలో జరిగే రజతోత్సవ వేడుకలకు సినీగేయ రచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

దాహం కేకలు



పొడగట్లపల్లి సచివాలయ వద్ద తాగునీటి కోసం నిరసన చేస్తున్న మహిళలు

రావులపాలెం, ఏప్రిల్ 4: వేసవిలో తాగునీటి వినియోగం ఎక్కువగా ఉనప్పటికి ఆ ప్రాంతానికి తాగునీరు అందించడంలో అధికారులు అలసత్వం వహించడంతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రావులపాలెం మండలం పొడగట్లపల్లి శివారు గొల్లగూడెంలో గత కొద్దిరోజులుగా తాగునీరు కుళాయి ద్వారా నీటిసరఫరాచేయడంలేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ద్వారా రక్షిత మంచినీటి పథకం సరఫరా చేయాల్సిన పైపులైన్లలో నీరు రాకపోవడం గోదావరి జలాలు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ద్వారాకూడా ఆ ప్రాంతానికి నీరు అందడంలేదు. తాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్పందించకపోవడంతో గురువారం స్థానిక సచివాలయ వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మామిడికుదురు, ఏప్రిల్ 4: మామిడికుదురుకు చెందిన వైసీపీ నాయకులు గురువారం మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ పోసిశెట్టి విస్సు, మాజీ ఉపసర్పంచ్ నయినాల వెంకటేశ్వరరావు(అబ్బాస్), యనమదల సీతారామరాజులు వైసీపీని వీడి రామచంద్రపురంలో బుధవారం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డుతో ఓటేయండి



ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డును చూపిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4: ఎన్నికల సంఘం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డుతో ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డులను పోస్టల్ శాఖ ద్వారా బట్వాడా చేయడం జరుగుతుందని వివరించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎపిక్ కార్డు సహాయంతో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రాథమికంగా భారతీయ పౌరులకు గుర్తింపురుజువుగా ఎపిక్‌కార్డు పనిచేస్తుందన్నారు. దేశంలో జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈకార్డులను వాడాలని తెలిపారు.

ముగిసిన ప్రజానాట్యమండలి వర్కుషాపు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 4: రామచంద్రపురంలో మూడు రోజులుగా జరుగుతున్న ప్రజా నాట్యమండలి ఎన్నికల పాటల వర్కుషాపు గురువారంతో ముగిసింది. ముగింపు సభలో సీనియర్ నాయకులు డా.చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ సాంస్కృతిక ఉద్యమం నిరంతరం కొనసాగాలని కోరారు.సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు, ప్రజా నాట్యమండలి జాతీయ కార్యదర్శి గని, రచయిత దేవ్వారకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాంలో పోలీస్ అబ్జర్వర్ పర్యటన



చెక్‌పోస్టు పరిశీలన

యానాం, ఏప్రిల్ 4: యానాంలో ఈనెల19న జరగనున్న పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పోలీస్ అబ్జర్వర్ అమర్‌దీప్ సింగ్‌రాయ్ యానాం వచ్చారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద పరిపాలనాధికారి, యానాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి, ఎస్పీ పి.రాజశేఖర్, సీఐ షణ్ముగం తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యానాం ఎన్నికలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి యానాం ముఖద్వారాల వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల చెక్‌పోస్టులను పరిశీలించారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన బీసీ నేతలు



చినబాబుకు టీడీపీ కండువా వేస్తున్న చంద్రబాబు

అంబాజీపేట, ఏప్రిల్ 4: రామచంద్రపురంలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో మండలానికి బీసీ ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. వైసీపీకి రాజీనామా చేసిన బీసీ నాయకుడు వాసంశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు (చినబాబు) ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాసంశెట్టి వరలక్ష్మి, ముక్కామల, గంగలకుర్రు సొసైటీ చైర్మన్లు వాసంశెట్టి రాంబాబు, మట్టపర్తి చంద్రశేఖర్, ఇటికాలమ్మ దేవస్థానం చైర్మన్ చప్పిడి సుబ్రహ్మణ్యం, మాచవరం వార్డు సభ్యుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, పలువురు ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. వీరందరికి చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా చినబాబు, చంద్రశేఖర్, రాంబాబులు మాట్లాడుతూ వైసీపీ సిద్ధాంతాలు నచ్చకపోవడంతో ఆ పార్టీకి రాజీనామాచేసి టీడీపీలో చేరామన్నారు. ఉమ్మడి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తామన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 4: రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముఖరం హుస్సేన్ కోరారు. గురువారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ కోసం బీజేపీతో పొత్తు పెట్టుకుందే తప్ప వేరే కారణం లేదన్నారు. ఐదేళ్లుగా జగన్ కూడా బీజేపీతో కలిసి ఉన్న విషయం తెలిసిందే అన్నారు. ముస్లింలు అందరూ తెలుగుదేశం కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అబ్రార్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, మీర్‌కరమ్‌అలీ, ఫర్హత్ అలీబేగ్, గులాం అబ్బాస్, ఎండీ అమీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రద్దుచేసిన ఎస్జీటీ పోస్టుల వివరాలు వెల్లడించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4: ప్రాథమిక విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్ని సెకండరీ ఉపాధ్యాయుల పోస్టులు రద్దు చేశారో వెల్లడించాలని ఆయన డిమాండు చేశారు. విద్యా రంగంలో సంస్కరణల్లో భాగంగా ప్రవేశపెట్టి జీవో నంబరు 117 వల్ల విద్యారంగ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. తక్షణం ఈజీవోపై పునః సమీక్ష చేయాలని, అవసరమైతే రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరిట చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా 14వేలకు పైగా ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడితో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈక్రమంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందో విద్యాశాఖ ఉన్నతాధికారులు చెప్పాలని ప్రశ్నించారు. 97మందికిలోపు విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను డీ గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం వల్ల అక్కడి నుంచి తరలించిన 6,7,8 తరగతి విద్యార్థులు ఉన్నత విద్య అందుతుందా అని ప్రశ్నించారు. ఏ పదోన్నతులు ఇవ్వాల్సి వచ్చినా ఎస్జీజీ పోస్టులను రద్దు చేయడం సర్వసాధారణమైపోయిందన్నారు. ప్రభుత్వం రద్దుచేసిన ఎస్జీటీ పోస్టుల వివరాలను వెల్లడించాలని డిమాండు చేశారు. 2019 లెక్కలతో పోలిస్తే ప్రభుత్వరంగ పాఠశాలల్లో చదివే పిల్లల సంఖ్య తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. జీవో నంబరు 117పై పూర్తిస్థాయి సమీక్ష జరగాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఎలా విద్యా విధానం ఉండాలో, విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి శాస్త్రీయంగా ఎలా ఉండాలో స్పష్టమైన విధి విధానాలను రూపొందించుకునేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరినట్టు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ పాత పెన్షన్‌విధానాన్ని అమలు చేయాలన్నారు. 2003డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ పాతపెన్షన్ అమలు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, కోశాధికారి సీహెచ్ కేశవరావు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, టి.దుర్గాప్రసాద్, వై.మురళీమోహన్, వైవీఎస్ఎన్ బాలాజీ, నల్లి విశ్వనాథ్, రాయుడు శ్రీనివాస్, ఎం.ప్రదీప్‌కుమార్, పెన్నా శ్రీనివాస్, బి.చంద్రకళ, కుడుపూడి శ్రీనివాస్, వి.రత్నం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రూ.4వేల పింఛన్ అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 4: రానున్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో పింఛన్‌దారులకు రూ.4వేలు ఇస్తామని ఆ పార్టీ కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గురువారం కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. ఖజానా ఖాళీ చేసి వృద్ధులకు, వితంతవులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయలేక ఆ నెపాన్ని తెలుగుదేశంపై నెట్టేస్తుందన్నారు. బూసి జయలక్ష్మిభాస్కరరావు, మహ్మద్ హుస్సేన్‌షరీఫ్, మిద్దే ఆదినారాయణ, కముజు వెంకటేశ్వరరావు, దేవపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బండారు ఎన్నికల ప్రచారం

కొత్తపేట, ఏప్రిల్4: కొత్తపేట మార్కెట్ వీధిలో గురువారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జనసైనికులు చిక్కం శివాజీ, తులా రాజు, మహ్మద్ హుస్సేన్ షరీఫ్, బీర ఇసాక్, మిద్దే ఆదినారాయణ, బూసి జయలక్ష్మి, రొట్ట వెంకటరమణ, అద్దంకి చంటిబాబు, దేవపాటి వెంకటేశ్వరరావు, చిక్కం హనుమంతు పాల్గొన్నారు.

జిల్లాలో 71.31 శాతం పింఛన్లు పంపిణీ



అంబాజీపేట: పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి



అలమూరు: వృద్ధులను ఆటో తీసుకొస్తున్న టీడీపీ. జనసేన నాయకులు

అంబాజీపేట, ఏప్రిల్ 4: జిల్లాలో 22గ్రామాలకు సంబంధించి 467సచివాలయ పరిధిలో 542కేంద్రాలను ఏర్పాటుచేసి సచివాలయ ఉద్యోగులు ద్వారా ఇప్పటివరకు 2,45,477 పింఛన్లకు 71.31 శాతం పంపిణీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి దుండి రాంబాబు అన్నారు. అంబాజీపేట మండలంలో మాచవరం, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో పింఛన్ పంపిణీని ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పింఛన్ల కోసం జిల్లాకు రూ.71.43కోట్లు మంజూరైందన్నారు. మంచంపై ఉన్న వారికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. శుక్రవారం పింఛన్ల పంపిణీ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ మమత, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, ఎన్.సత్యవేణి, ఉపాధి ఏపీవో చంద్రమోహన్, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల సహాయం

అలమూరు, ఏప్రిల్ 4: మండలంలో గురువారం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పెనికేరులో టీడీపీ, జనసేన నాయకులు వృద్ధులకు అండగా నిలిచారు. వారిని ఇంటి నుంచి ఆటోలో తీసుకువెళ్లి పింఛన్ తీసుకున్న తర్వాత ఇంటి వద్ద దించేశారు. మండలంలో గురువారం 70శాతం పైబడి పింఛన్లు పంపిణీ చేసినట్టు అధికారులు చెప్పారు.

67శాతం పింఛన్ల పంపిణీ

కె.గంగవరం, ఏప్రిల్ 4: మండలంలో గురువారం సాయంత్రానికి 67శాతం సామాజిక పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, ఈవోపీఆర్‌డి యు.నాగేంద్ర తెలిపారు. సచివాలయాల్లో సిబ్బందితో పంపిణీ చేశామన్నారు. శుక్ర,శనివారాల్లో మిగిలిన పింఛన్లు ఇస్తామన్నారు.

85శాతం పూర్తి

అల్లవరం, ఏప్రిల్4: మండలంలో 9200 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 85శాతం మందికి రూ.1.72కోట్లు పంపిణీ చేసిన్నట్లు ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులకు పంపిణీ చేస్తున్నామన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం

ఆలమూరు, ఏప్రిల్ 4: జొన్నాడలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, సుప్రభాత సేవ, సుదర్శన్‌హోమం, శిఖర అభిషేకం, మహాపూర్ణ హారతిని వేదపండితులు శాస్త్రోక్తం జరిపించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు

అమలాపురంరూరల్, ఏప్రిల్4: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. ఈదరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన ఓటర్ల అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఎంపీడీవో కె.లక్ష్మీరెడ్డి, మొబలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, సీహెచ్ వీరభద్రానందం, సత్తి సత్యకృష్ణ, పెచ్చెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూల్యాంకనం ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ

అమలాపురంటౌన్, ఏప్రిల్4: పదోతరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులకు మూడు రోజులుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. గురువారం అమలాపురం జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో మూల్యాంకనం చేస్తున్న 1100మంది ఉపాధ్యాయులకు జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, బొంతు చంద్రకళ, పేపకాయల చంద్రరావు, పరమేష్, కేవీఎన్ గౌడ్, బీవీఎన్ వెంకటేశ్వరరావ మజ్జిగ పంపిణీ చేశారు.

వికాస్ పాఠశాల వార్షికోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్4: రామచంద్రపురంలో వికాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల వార్షికోత్సవం బలుసు వెంకట్రాయుడు కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, నమ్మకం వికాస్ విద్యాసంస్థల విద్యార్థుల పట్ల యాజమాన్యం మరింత గురుతర బాధ్యతను పెంచిందన్నారు. విద్యలో ప్రతిభచూపిన, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకట రమణ బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వాసంశెట్టి రూన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబును కలిసిన కూటమి అభ్యర్థులు

మండపేట, ద్రాక్షారామ, ఏప్రిల్ 4: ద్రాక్షారామలో బుధవారం రాత్రి జరిగిన ప్రజాగళంలో పాల్గొన్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో రాత్రి బస చేశారు. గురువారం ఉదయం అక్కడ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన టీడీపీ కూటమి అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి వారికి దిశనిర్దేశం చేశారు. చంద్రబాబును కలిసి వారిలో అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు వేగుళ్ల జోగేశ్వరరావు, వాసంశెట్టి సుభాష్, దాట్ల బుచ్చిబాబు, అయితాబత్తులు ఆనందరావు, బండారు సత్యానందరావు, కాకినాడ జిల్లాకు చెంది నిమ్మకాయల చినరాజప్ప, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, టీడీపీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, వై.వి.దాస్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు చంద్రబాబు సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు.

చంద్రబాబుకు వీడ్కోలు పలికిన నేతలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 4: రామచంద్రపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుకు గురువారం తెలుగుదేశం, జనసేన నేతలు వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి ద్రాక్షారామలో ప్రజాగళంలో పాల్గొన్న చంద్రబాబు రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో బస చేశారు. గురువారం పార్టీ నేతలతో సమీక్ష అనంతరం సాయంత్రం వీఎస్ఎం కళాశాల వద్ద నుంచి కాన్వాయ్‌లో 4 గంటల ప్రాంతంలో ముచ్చిమిల్లి రోడ్డులో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలీపాడ్ వద్ద అమలాపురం పార్లమెంటు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రామచంద్రపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, జనసేన నిజయోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు రేవు శ్రీను, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్. మాజీ ఏఎంసీ చైర్మన్లు గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, కొమరిన వీర్రాజు తదితరులు చంద్రబాబుకు వీడ్కోలు పలికారు. 4.19గంటలకు హెలీకాప్టర్ టేకాఫ్ అయింది.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట ఏప్రిల్ 4: స్థానిక గాంధీనగర్‌లోనిజమియా మసీదులో (చిన్నమసీదు) గురువారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. అల్లా చూపిన మార్గంలో మానవాళి నడుచుకోవాలని సూచించారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు. ముస్లింలకు వేగుళ్ల రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బలహీనవర్గాల అభివృద్ధే టీడీపీ ఎజెండా

అంతర్వేది, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బలహీనవర్గాల అభివృద్ధే టీడీపీ ఎజెండా అని నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు అన్నారు. అంతర్వేదిపాలెంలో క్లస్టర్-2 ఇన్‌చార్జి ముప్పర్తి నాని ఆధ్వర్యంలో కౌరు సత్యనారాయణ, కౌరు శ్రీనివాస్ అధ్యక్షతన జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించారు. ముప్పర్తి నాని, మంగెన భూదేవి, బందెల పద్మ, చాగంటి స్వామి, కడలి వెంకటరత్నం తిరుమాని ఆచార్యులు, కొల్లు మహాలక్ష్మి, కొల్లు రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏడిదలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

మండపేట, ఏప్రిల్ 4: ఏడిదలో టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో వైసీపీ ఫ్యాన్‌పని అయిపోయిందని, ఫ్యాన్ రెక్కలు విరిగి మూలకు చేరిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని వేగుళ్ల కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. వైసీపీని గద్దె దించటమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. స్థానిక నేతలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఆత్రేయపురం, ఏప్రిల్4:నార్కెడిమిల్లిలోని శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం వేదపండితులు ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు గురువారంఉదయం 9.10గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. విగ్రహ, యంత్ర, ఆలయ, శిఖర, ప్రతిష్ఠ మహోత్సవం, ప్రధాన హోమం, మహాశాంతి హోమం, విశేష అర్చన కార్యక్రమాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 4: 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వన్నెచింతలపూడి ఫీడర్, కోర్టు ఫీడర్, ఎ.వేమవరం ఫీడర్లపై చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా కామనగరువు, చిందాడగరువు, తాండవపల్లి, సమనస, వన్నెచింతలపూడి, నవరప్పాలెం, రెడ్డిపల్లి, ఎ.వేమవరం, ఎ.వేమవరప్పాడు. భట్నవిల్లి తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పి.గన్నవరం: కొత్తపేట-ముక్కామల 33కేవీ లైన్‌లో నూతన విద్యుదీకరణ పనులు కోసం గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నరేంద్రపురం 33కేవీ, 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

వెంకన్న ఆదాయం రూ.2.28లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ2,28,244 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

జనసేనకు సందాడి రాజీనామా

అల్లవరం,ఏప్రిల్4: జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందాడి శ్రీనుబాబు పార్టీ పదవికి రాజీనామా చేసిన్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు అందించిన్నట్లు తెలిపారు. అమలాపురంలో ఇటీవల టీడీపీ నాయకులు బీసీ,ఎస్సీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో చేసిన ప్రకటన మనోవేదనకు గురిచేసిందన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఆత్రేయపురం, ఏప్రిల్ 4: మహిళ అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆత్రేయపురం చినపేటకు చెందిన పంపన గంగ(60) తన ఇంట్లో అనుమనాస్పదంగా మృతిచెందారు. ఆమె కీళ్లవాతంతో బాధపడుతుంది. ఆమె భర్త సూర్యారావు చినపేటలోనే వేరుగా ఉంటున్నాడు. ఆమె కుమారులు కిషోర్, విజయ్ ఉద్యోగ రీత్య వేరే ప్రాంతంలో ఉంటున్నారు. ఆమె ఒంటరిగా జీవిస్తోంది. బుధవారం సాయంత్రం గంగఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు అనుమానం వచ్చి తలుపులు పగలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె తలకు బలమైన గాయమై మంచం పక్కన కింద పడి ఉన్నట్లు గుర్తించారు. ఈవిషయం విజయవాడలోని చిన్న కుమారుడికి స్థానికులు తెలిపారు.గురువారం కుమారులు తల్లి మృతదేహాన్ని చూసి అనుమానం వ్యక్తంచేశారు. ఈసంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

ముమ్మిడివరం, ఏప్రిల్4: తన కుమార్తె ఈనెల2వ తేదీ రాత్రి నుంచి కనిపించడంలేదని ముమ్మిడివరం నగర పంచాయతీ ప్రాంతానికి చెందిన తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎస్‌హెచ్‌వో జీబీ స్వామి కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులపై వివాహిత ఫిర్యాదు

ముమ్మిడివరం, ఏప్రిల్ 4: కట్నం వేధింపులపై ఒక మహిళ గురువారం ఫిర్యాదు చేసింది. అయినాపురం పడమటిపేటకు చెందిన సుజాతకు 2014లో పల్లంకుర్రుకు చెందిన మోకా నాగేశ్వరరావుతో వివాహమైంది. అదనపు కట్నం తీసుకురమ్మని భర్త నాగేశ్వరరావు, అత్త సత్యవతి, మరిది భాస్కరరావు, ఆడపడుచు నెల్లి మల్లేశ్వరి వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

పి.గన్నవరం, ఏప్రిల్ 4: నాగుల్లంక ఏటిగట్టు దిగువున శ్మశానవాటిక సమీపంలో పేకాట శిబిరంపై దాడిచేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8,200 నగదు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

యానాం, ఏప్రిల్ 4: స్థానిక మసీదులో గురువారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల అనంతరం రహీం బ్రదర్స్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు కార్యక్రమంలో మసీదు ప్రతినిదులు, స్థానిక ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	బహుముఖం
వెంకటరమణ	భరతనాట్యం
శ్రీలలిత	గో ఎట్ లైఫ్
శేఖర్ స్క్రీన్-1	మంజుమ్మల్‌బాయ్స్
శేఖర్ స్క్రీన్-2	ఓంబీమ్‌బుష్
రమా	డీజేటిల్లు స్క్వేర్
గణపతి	భీమా
వెంకటపద్మావతిస్క్రీన్-1	ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	గాడ్జిల్లా అండ్‌కాంగ్

నల్లా నడక కవిత్వానికి జాతీయస్థాయి గుర్తింపు



అమలాపురం టౌన్, ఏప్రిల్ 4: 1999 నుంచి ఇప్పటివరకు 103 నడక నానీల పుస్తకాలను రచించి ప్రచురించి సమాజ ఆరోగ్య పరిరక్షణలో సాహిత్యాన్ని వినియోగిస్తున్న శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తికి తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డులో నమోదుచేసి గురువారం జాతీయస్థాయిలో గుర్తింపు ప్రశంసా పత్రాన్ని అందించింది. నడకతోనే ఆరోగ్యమంటూ ఆయన రచించిన నానీల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అకాడమీ చీఫ్ ఎడిటర్ కె.ఉష ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కత్తిమండ ప్రతాప్, తేతల సత్యనారాయణరెడ్డి, చింతా శంకరమూర్తి తదితరులు నల్లాను అభినందించారు.

మాదిగలకు ఎమ్మెల్సీ ప్రకటనపై హర్షం

అంబాజీపేట, ఏప్రిల్ 4: రావులపాలెంలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు అన్నారు. కె.పెదపూడిలో మాదిగ సామాజిక వర్గీయుల సమావేశం జరిగింది. ఉమ్మడి పార్టీ అభ్యర్థుల విజయానికి మాదిగలంతా కృషిచేస్తామన్నారు. సమావేశంలో నాయకులు మందా రాజేష్, నేదునూరి వెంకటరమణబాబు, నేదునూరి పెద్దిరాజు, చట్టుగుళ్ల రెడ్డి కూనవరపు మధు, నేదునూరి సుధీర్, పెదపూడి సురేష్, వంశీ, దిలీప్ పాల్గొన్నారు